తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
బుధవారం 8 జూలై 2026
పేజీలు : 08





## ప్రభుత్వ పాఠశాలల మూసివేత నిర్ణయాన్ని ఉపసంహరించాలి

**ముఖ్యమంత్రికి విద్యావేత్తలు, మేధావుల బహిరంగ లేఖ**

**ముషీరాబాద్, జూలై 7 (జనం సాక్షి):** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను తగ్గించే ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని విద్యావేత్తలు, మేధావులు, కవులు, ప్రజాసంఘాల ప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆ లేఖను విడుదల చేశారు. ప్రభుత్వ పాఠశాలల మూసివేతకు బదులుగా వాటిని బలోపేతం చేయాలని, గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలను కొనసాగించాలని, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులు ప్రారంభించాలని, మౌలిక వసతులు కల్పించి ఖాళీ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. విద్యా ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణను నియంత్రించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రముఖ పాత్రికేయుడు కే. రామచంద్రమూర్తి మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్య తగ్గిందనే కారణంతో వేలాది పాఠశాలలను మూసివేయడం సరైన నిర్ణయం కాదన్నారు. మాజీ నాక్ చైర్మన్ ప్రొఫెసర్ వి.ఎస్. ప్రసాద్, మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, ఆర్థికవేత్త ప్రొఫెసర్ డి. నరసింహారెడ్డి, మాజీ కేంద్ర సమాచార కమిషనర్ ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్, హైకోర్టు సీనియర్ న్యాయవాది చిక్కుడు ప్రభాకర్, కవి డాక్టర్ నందిని సిధ్దారెడ్డి, ప్రొఫెసర్ జి. హరగోపాల్, ప్రొఫెసర్ కె. చక్రధర్ రావు, ప్రొఫెసర్ కె. లక్ష్మీనారాయణ తదితరులు ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా విమర్శిస్తూ, ప్రజా విద్యను పరిరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వివిధ ఉపాధ్యాయ సంఘాలు, విద్యా పరిరక్షణ కమిటీలు, ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొని ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని పునర్విమర్శించాలని విజ్ఞప్తి చేశారు.

## మనవ మనుగడకు మొక్కలు జీవనాధారం

**ప్రతి ఇంటి ఆవరణలో మొక్కలు నాటి సంరక్షించాలి**

**మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజబాల్ రెడ్డి**

**తాండూరు జులై 7 (జనంసాక్షి) :** మనవ మనుగడకు మొక్కలు జీవనాధారమని మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజబాల్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంట్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజబాల్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం తాండూర్ మున్సిపల్ పరిధిలోని వార్డు నెంబర్లు 14, 15, 16, 17లో స్థానిక కౌన్సిలర్లు, మైప్మా ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చైర్‌పర్సన్ నీరజబాల్ రెడ్డి ప్రజలకు స్వయంగా మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వనమహోత్సవం లక్ష్యం ప్రతి వార్డులో, ప్రతి ఇంటా మొక్కలు నాటాలని అన్నారు. నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యతను కూడా ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. పచ్చదనం పెంచడం ద్వారానే పర్యావరణ సమతుల్యతను కాపాడుకోగలమని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, సంబంధిత వార్డుల కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు మరియు స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆసుపత్రి కాంట్రాక్టు వర్కర్లకు
# 26 వేల వేతనం చెల్లించాలి

- కనీస వేతనం అమలు చేయకపోతే నిరసనలు
- నాలుగు సంవత్సరాలుగా 11 వేలతోనే సరిపెట్టుకోవాలా?
- టెండర్లలో 26 వేల కోటింగ్, సెలవులు కావాలి
- జూలై 9న కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా

**శేరిలింగంపల్లి, జూలై 7 (జనం సాక్షి):** ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్

మిగితా 2లో



ప్రభుత్వ పాఠశాలల మూసివేత నిర్ణయాన్ని ఉపసంహరించాలి 2
ముఖ్యమంత్రికి విద్యావేత్తలు, మేధావుల బహిరంగ లేఖ

## భర్తను కడదేరిన భార్య... ప్రియుడి కోసం దారుణ హత్య

- మియాపూర్‌లో మరో కిరాతక హత్యోదంతం
- ఏడు నెలలు తప్పించుకున్న భార్య పథకం
- కాల్‌డేటా, సీసీటీవీలతో బయటపడ్డ నిజం
- మహారాష్ట్ర సరిహద్దులో మృతదేహం వెలికితీసిన పోలీసులు

2






## అన్ని పత్రాలు పరిశీలించే భూమి కొన్నాం

- చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను కొనసాగించాలి
- ఇంద్రకంటి రాజేష్ కిరణ్ డిమాండ్

**వికారాబాద్, జూలై 07 (జనంసాక్షి) :** వికారాబాద్ మండలం మదన్‌పల్లి గ్రామంలోని సర్వే నెంబర్ 167, 168లో గల వ్యవసాయ భూమికి సంబంధించి చట్టబద్ధమైన రిజిస్ట్రేషన్ ప్రక్రియను అడ్డుకునేందుకు కొందరు వ్యక్తులు నిరాధార ఆరోపణలు చేస్తూ ప్రభుత్వ అధికారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని సదరు భూమి కొనుగోలుదారులు ఇంద్రకంటి రాజేష్ కిరణ్ డిమాండ్ చేశారు. ఆ భూమి యాజమాని వాసవి అనే మహిళ నుంచే అగ్రిమెంట్ ఆఫ్ సేల్ చేసుకున్నట్టు తెలిపారు. అందుకు సంబంధించిన పత్రాలన్నీ అధికారులకు కూడా సమర్పించానని, ఆ ప్రకారమే రిజిస్ట్రేషన్‌కు స్లాట్ కూడా బుక్కయ్యిందని వివరించారు. కానీ ఉజ్వల అనే మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రిజిస్ట్రేషన్‌ను అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. నేరుగా భూమి యజమాని నుంచే కొనుగోలు చేసినప్పుడు.. వేరొకరి తప్పుడు ఆరోపణల ఆధారంగా రిజిస్ట్రేషన్ నిలిపివేయడం సరికాదన్నారు. ప్రభుత్వ నిబంధనలను అనుసరించి ఆ భూమిని కొనుగోలు చేసిన తమకు చట్టప్రకారంగా రిజిస్ట్రేషన్ చేయాలని, అన్ని సమగ్ర వివరాలను రెవెన్యూ అధికారులకు కూడా సమర్పించామని రాజేష్ కిరణ్ తెలిపారు. తప్పుడు ఫిర్యాదు చేసి అధికారులను, ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.



## మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి

- పాఠశాల ప్రాంగణాన్ని నిరంతరం పరిశుభ్రంగా ఉంచుకోవాలి : జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

**తాండూరు జులై 7(జనంసాక్షి) :** మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన పెద్దేముల్ మండలం మంబాపూర్ లోని మహాత్మ జ్యోతిరావు పూలే పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను, వంటగదిని క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. జిల్లా కలెక్టర్ విద్యార్థుల చేత ఎటువంటి పనులు చేయించకూడదని, వడ్డన బాధ్యతను ఏజెన్సీ సిబ్బందే నిర్వహించాలని ఆదేశించారు. పాఠశాల ప్రాంగణాన్ని నిరంతరం పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అలాగే స్థానిక తహసీల్దారు వారానికి ఒకసారి పాఠశాలను సందర్శించి పరిస్థితులను పర్యవేక్షించాలని ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదివి, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కలెక్టర్ తో పాటు జిల్లా బీసీ సంక్షేమ అధికారి మాధవరెడ్డి, స్థానిక తహసీల్దార్ వెంకటేష్ ప్రసాద్, పాఠశాల ప్రిన్సిపాల్ పాండే తదితరులు పాల్గొన్నారు.



# ఇల్లు బిల్లులో కాంగ్రెస్ నేతకు వాటాలు

- లబ్ధిదారుల ఖాతాలో డబ్బులు పడాలంటే ముడుపులు ఇవ్వవలసిందే
- ఇద్దరు నేతల మధ్య సంభాషణ సోషల్ మీడియాలో వైరల్
- ఈ వీడియో జిల్లా వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తుంది
- వీడియో వైరల్ పై ఎమ్మెల్యే నజర్



**వికారాబాద్ జిల్లా బ్యూరో జూలై 7 (జనం సాక్షి):** పేదల సొంతింటి కల నెరవేర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఇందిరమ్మ ఇళ్ల పథకం కొందరు దళారులు అధికార పార్టీ నేతల చేతిలో బలైపోతుంది.. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన బిల్లు వారి ఖాతాల్లో పడాలంటే వేల లంచం ఇవ్వవలసిందే. అంటూ బెదిరింపులు వస్తున్నాయి. వికారాబాద్ జిల్లాలో వెలుగులోకి వచ్చిన ఈ సంఘటన ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఓ కాంగ్రెస్ నేత డబ్బులు డిమాండ్ చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. బషీరాబాద్ మండలం జలాల్ పూర్ గ్రామంలో ఒక బడా కాంగ్రెస్ నేత ఇందిరమ్మ ఇండ్ల బిల్లుల కోసం లబ్ధిదారుల నుంచి లంచం డిమాండ్ చేసినట్లు వీడియో బయటపడింది. పేద ప్రజల కోసం రాష్ట్ర ప్రభుత్వం వారి సొంత ఇంటి కల నెరవేర్చడానికి ఇందిరమ్మ పథకం అమలు చేస్తుంది. అధికార యంత్రాంగం వడబోసి అతిపెద లబ్ధిదారులను ఎంపిక చేసి ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. క్యాటగిరి విధంగా ఒక్కొక్క దశలో ఒక్కొక్క రకమైన బిల్లును అధికారులు లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తున్నారు. పేద ప్రజలు రెక్కలు ముక్కలు చేసుకొని పైసా పైసా కూడా పెట్టిన సొమ్ము తో కొంత డబ్బు బయట అప్పు చేసి ఇంటి నిర్మాణానికి సాయశక్తుల కృషి చేస్తున్నారు. అలాంటి సామాన్య లబ్ధిదారుల నుంచి మధ్య దళారులతో కలిసి ఒక కాంగ్రెస్ నేత ఇంటి బిల్లు కోసం పదివేల రూపాయలు లంచం డిమాండ్ చేశారు. అంతేకాకుండా బ్యాంకు ఖాతాలో డబ్బులు వచ్చాయా లేదో అని తెలుసుకుంటానని ఒక మహిళ చేతి వేలి ముద్రలను తీసుకున్న కొన్ని గంటలలోనే ఆమె ఖాతా నుంచి పదివేల రూపాయలు మాయమైనట్లు మెసేజ్ వచ్చింది. దీంతో మధ్య దళారులు కాంగ్రెస్ నేత కలిసి లబ్ధిదారుల నుంచి దండిగా డబ్బులు దండుకుంటున్న వైనం వెలుగులోకి వచ్చింది. ఈ విషయమై ఆ నోట ఈ నోట స్థానిక తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి దృష్టికి వెళ్ళింది. ఇందిరమ్మ ఇండ్ల బిల్లులో కాంగ్రెస్ నాయకులు ఎవరు డబ్బులు తీసుకోవద్దని గట్టిగా మందలించినట్లు ఆ కాంగ్రెస్ నేత స్వయంగా మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది.

అంతేకాకుండా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల దగ్గర డబ్బులు దండుకున్న కాంగ్రెస్ నేతను మరో కాంగ్రెస్ నేత గట్టిగా మందలిస్తూ ఆయన అవినీతి చిట్ట విప్పి వీడియో రికార్డ్ చేశారు. ఇప్పటివరకు ఎంతమంది లబ్ధిదారుల దగ్గర డబ్బులు దండుకున్నారో వారిని బెదిరించి లంచంగా డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారో ఆ వీడియోలో స్పష్టంగా రికార్డు అయింది. ఈ సందర్భంగా ఇద్దరు కాంగ్రెస్ నేతల మధ్య వాగ్వివాదం జరిగింది. ఒకింత కాంగ్రెస్ నేత గట్టిగా బెదిరించిన విషయం వీడియోలో రికార్డు అయింది. దీంతో కాంగ్రెస్ నేతలు ఇందిరమ్మ ఇండ్ల బిల్లులో వాటా లు పుచ్చుకుంటున్నట్లు స్పష్టమవుతుంది. ఈ వీడియో మీడియాకు అందడంతో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల బిల్లుల్లో అధికారులు అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ముఖ్య మంత్రి స్వయంగా హెచ్చరించారు. కానీ కాంగ్రెస్ నేత నే ఇందిరమ్మ ఇండ్ల బిల్లు చెల్లింపులలో అవినీతికి పాల్పడితే ఆ నేతపై జిల్లా కాంగ్రెస్ కమిటీ ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సిందే..

# భర్తను కడదేరిన భార్య...

**శేరిలింగంపల్లి, జూన్ 07:** అక్రమ సంబంధాల కారణంగా భర్తను హత్య చేసి మహారాష్ట్ర సరిహద్దులో మృతదేహాన్ని పాతిపెట్టిన ఘటన మియాపూర్‌లో వెలుగులోకి వచ్చింది. గత నవంబర్‌లో భర్త పెంటయ్య (45) కనిపించడం లేదంటూ భార్య సత్యవతి పోలీసులకు ఫిర్యాదు చేసి, ఏడు నెలల పాటు అందరినీ తప్పుదోవ పట్టించింది. అయితే పోలీసు దర్యాప్తులో సత్యవతి తన ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసినట్లు అంగీకరించింది. పెంటయ్య కనిపించడం లేదని సత్యవతి మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేసిన తర్వాత, భర్త అలిగి ఇంటి నుంచి వెళ్లిపోయాడని, కొడుకులతో మనస్పర్ధలు కారణమని చెప్పి అందరినీ నమ్మించింది. కానీ కాల్‌డేటా రికార్డులు, సీసీటీవీ ఫుటేజీల విశ్లేషణలో నిజం బయటపడింది. పోలీసుల విచారణలో సత్యవతి తన భర్త హత్యకు తానే కారకురాలని ఒప్పుకుంది. అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భావించి ప్రియుడితో కలిసి హత్య చేసి మహారాష్ట్ర సరిహద్దులో మృతదేహాన్ని పాతిపెట్టినట్లు వెల్లడైంది. మియాపూర్ పోలీసులు మహారాష్ట్ర పోలీసుల సహాయంతో మృతదేహాన్ని వెలికితీశారు. సత్యవతిని అదుపులోకి తీసుకున్న పోలీసులు, పరారీలో ఉన్న ఆమె ప్రియుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ హత్యలో మరో ఇద్దరు ప్రమేయం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రియుడు దొరికితే కేసులో మరిన్ని వివరాలు వెల్లడిస్తామని ఉన్నతాధికారులు తెలిపారు. ఈ ఘటన సమాజంలో కుటుంబ సంబంధాలు, సామాజిక విలువలు మరుగున పడుతున్నట్లు చెప్పకుండా చెబుతోంది. ఇటీవల కాలంలో అక్రమ సంబంధాలు, ఆస్తి వివాదాలు కారణంగా భర్తలను హత్య చేసే సంఘటనలు పెరుగుతున్నాయి.

ఆసుపత్రి కాంట్రాక్టు వర్కర్ల డిమాండ్: 26 వేల వేతనం చెల్లించాలి

కనీస వేతనం అమలు చేయకపోతే నిరసనలు

## ఆసుపత్రి కాంట్రాక్టు వర్కర్లకు 26 వేల వేతనం చెల్లించాలి

యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.డి. యూసుఫ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహ మాట్లాడుతూ, గత నాలుగు సంవత్సరాలుగా హెచ్‌ఎఫ్‌ఎంఎస్ ఉత్తర్వుల ప్రకారం కాంట్రాక్టు పద్ధతిలో నియమితులైన కార్మికులకు జీవో నంబర్ 60 ప్రకారం పీఎఫ్, ఈఎస్ఐ మినహాయింపుతో నెలకు 13,500 రూపాయలు చెల్లించాల్సి ఉండగా, యాజమాన్యాలు కేవలం 11 వేల రూపాయలు మాత్రమే ఇస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ల అక్రమ సంపాదన వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దుయ్యబట్టారు. ప్రస్తుత జీవన వ్యయం, నిత్యావసర వస్తువుల ధరలను దృష్టిలో ఉంచుకుని కనీస వేతనం 26 వేలుగా నిర్ణయించాలని యూనియన్ డిమాండ్ చేసింది. రానున్న టెండర్ ప్రక్రియల్లో 26 వేల రూపాయల కోటింగ్‌ను తప్పనిసరిగా నమోదు చేయాలని, నాలుగు పండగలు, నాలుగు జాతీయ సెలవులతోపాటు ప్రతి సంవత్సరం కనీసం 15 ఆర్జిత సెలవులు కేటాయించాలని కోరారు. ఈ నెల 9న వైద్య ఆరోగ్య కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు యూనియన్ నాయకులు ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర వైద్య విధాన పరిషత్ ప్రత్యేక చొరవ తీసుకుని తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని వారు కోరారు. లేని పక్షంలో నిరసన కార్యక్రమాలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.

## మహిళ గురుకుల కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

**శామీర్ పేట్, జులై 07(జనం సాక్షి) :** శామీర్‌పేట్‌లోని సాంఘీక సంక్షేమ గురుకుల మహిళ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు ప్రారంభ మయ్యాయని ప్రిన్సిపాల్ డాక్టర్ ఇశ్రత్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.బి ఎస్సి, బికం (కంప్యూటర్), బిఎస్సీ (ఎంఎస్‌సిఎస్), బిఎస్సీ (ఎంఎస్‌డిఎస్) మొదలగు కోర్సులల్లో అర్హత కలిగిన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలకు రావాలని తెలిపారు. సీట్లు పరిమితంగా ఉన్నందున, అడ్మిషన్లు సీట్ల ఆధారంగా ఇవ్వబడతాయని ప్రిన్సిపల్ ఇశ్రత్ తెలిపారు.

### ఎన్కతల గ్రామంలో ఘనంగా పద్మశ్రీ

# మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు



**మోమిన్‌పేట, జూలై 7 (జనం సాక్షి) :** పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదినాన్ని పురస్కరించుకుని వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట మండలంలోని ఎన్కతల గ్రామంలో మాజీ సర్పంచ్ మీనాపల్లి అనంతయ్య ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ, కేక్‌కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మాదిగ సమాజ హక్కుల సాధన, సామాజిక న్యాయం కోసం మందకృష్ణ మాదిగ చేస్తున్న కృషి ఆదర్శప్రాయమని కొనియాడారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మీనపల్లి అనంతయ్య మాదిగ, ఆర్కతల అనంతయ్య మాధిగ,దప్పు పోచయ్య కక్కేనిగారి కృష్ణ రామయ్య మాజీ ఉప సర్పంచ్ నర్సింలు జనార్దన్ హనుమంతు దప్పు శామ్ మాధిగ, మాజీ అంబేద్కర్ టి .రమేష్ టి.ఆనందు చిట్టిబాబు, అంబేద్కర్ అధ్యక్షులు చిట్టిబాబు రమేష్ కన్నయ్య, భారత్, ప్రభు, దర్శన్ అనిల్ సమ్మయ్య మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సమావేశంలోపాల్గొన్న మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి




**హయత్ నగర్, జులై 7 (జనం సాక్షి)** :భారతీయ జనతా పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామ్ చందర్ రావు, మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ రావు తదితర ముఖ్య నాయకులు హాజరయ్యారు. సమావేశంలో పార్టీ సంస్థాగత బలోపేతం, రాబోయే కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై చేపట్టాల్సిన కార్యాచరణ, కార్యకర్తల పాత్ర వంటి అంశాలపై నాయకులు దిశానిర్దేశం చేశారు. పార్టీని మరింత బలోపేతం చేసి ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పార్టీ కార్యక్రమాల విజయవంతానికి తన వంతు కృషి కొనసాగిస్తానని పేర్కొన్నారు.



## 6 ఏళ్ల తర్వాత తాటిపర్తికి చేరిన 'నైట్ అవుట్' బస్సు

### సర్పంచ్ నీలం ఝాన్సీ రమేష్ చొరవతో సర్వీస్ పునఃప్రారంభం

**యాచారం, జూలై 7(జనం సాక్షి) :** యాచారం మండల పరిధిలోని తాటిపర్తి గ్రామానికి గత ఆరు సంవత్సరాలుగా నిలిచిపోయిన ఆర్టీసీ నైట్ అవుట్ బస్సు సౌకర్యం ఎట్టకేలకు తిరిగి ప్రారంభమైంది. గ్రామ సర్పంచ్ నీలం ఝాన్సీ రమేష్ ప్రత్యేక చొరవ, నిరంతర కృషితో ఈ బస్సు సర్వీస్ పునరుద్ధరించబడింది. ఈ సందర్భంగా తాటిపర్తి గ్రామ ప్రజల తరపున డిపో మేనేజర్ సుజాతకు సర్పంచ్ మరియు గ్రామస్థులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ నైట్ అవుట్ బస్సు ప్రతిరోజూ రాత్రి 08:15 గంటలకు ఇబ్రహీంపట్నం డిపో నుండి బయలుదేరి వయా యాచారం, నందివనపర్తి, సింగారం, మీర్ఖాన్‌పేట గ్రామాల మీదుగా రాత్రి 09:30 గంటలకు తాటిపర్తి గ్రామానికి చేరుకుంటుంది. ఈ బస్సు సౌకర్యం పునఃప్రారంభం కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, తాటిపర్తి మరియు చుట్టుపక్కల పరిసర గ్రామాల ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు ఈ రాత్రి బస్సు సర్వీస్‌ను పెద్ద సంఖ్యలో ఉపయోగించుకుని సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ నీలం ఝాన్సీ రమేష్ ఈ సందర్భంగా కోరారు.



### ఆకాశం కరుణించలేదు...

# కడవతోనే పంట బతికిస్తున్న రైతన్న

### వర్షాలు లేక అల్లాడుతున్న పంటలు

యలాల జులై (జనంసాక్షి) : వర్షాలు సకాలంలో కురవకపోవడంతో యలాల మండలం విశ్వనాథ్‌పూర్ గ్రామంలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి చెందిన ఒక రైతు తన పొలంలోని మొక్కలను కాపాడుకునేందుకు కడవలతో నీరు మోసి పోస్తున్న దృశ్యం అందరినీ కలచివేస్తోంది. బోర్లు, కాలువల్లో నీరు లేకపోవడంతో వేరే మార్గం లేక ఈ విధంగా పంటను బతికించుకునే ప్రయత్నం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. గత కొన్ని వారాలుగా వర్షం పడకపోవడంతో విత్తిన విత్తనాలు, నాటిన మొక్కలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే సహాయ చర్యలు చేపట్టి, తాగు, సాగునీటి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు. కరువు కారణంగా ఈ ప్రాంతంలోని రైతుల జీవనం అగమ్యగోచరంగా మారింది.

# గోపాలపురం, ఎల్బీనగర్‌లో జోరుగా ఎస్ఐఆర్

## ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లకు అండగా బీఆర్ఎస్ నాయకులు



**ఖమ్మం, (జనంసాక్షి) :** ఖమ్మం నగర పరిధిలోని గోపాలపురం, ఎల్బీనగర్ ప్రాంతాల్లో కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతోంది. మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ నాయకులు, పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) క్షేత్రస్థాయిలో విస్తృతంగా పనిచేస్తూ ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, బిఎల్ఏ లు దేవభక్తుని కిషోర్ బాబు, గొల్లపూడి రాంప్రసాద్ బీఎల్ఓ వల్లపుదాసు హనీషాతో సమన్వయం చేసుకుంటూ ప్రతి ఇంటిని సందర్శిస్తున్నారు. ఓటర్లను నేరుగా కలుసుకుని వారి వివరాలను పరిశీలిస్తూ, అవసరమైన చోట సవరణలు చేయిస్తూ, ఫారమ్‌లను పూరించడంలో సహకారం అందిస్తున్నారు. ఎలాంటి అర్హత కలిగిన ఓటరు జాబితా నుంచి తప్పిపోకుండా, ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా నమోదు చేసేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. 2002 సంవత్సరం నాటి ఓటరు జాబితాను ప్రామాణికంగా తీసుకుని, ఓటర్ల వివరాలను పరిశీలిస్తూ ఎక్కడా పొరపాట్లకు తావులేకుండా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభమనే విషయాన్ని వివరిస్తూ, ఓటర్లలో చైతన్యం కల్పిస్తున్నారు. ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ, నమోదు ప్రక్రియను సులభతరం చేయడంలో బీఆర్ఎస్ నాయకులు, బీఎల్ఏలు కీలక పాత్ర పోషిస్తున్నారు. గోపాలపురం, ఎల్బీనగర్ ప్రాంతాల్లోని ప్రతి వీధిని చుట్టేస్తూ, ప్రతి కుటుంబాన్ని పలకరిస్తూ ఓటర్లను నమోదు ప్రక్రియలో భాగస్వాములను చేస్తున్నారు. సంబంధిత కేంద్రాలకు రావడానికి ఇబ్బంది పడుతున్న వారికి అవసరమైన సూచనలు అందిస్తూ, ఫారమ్‌ల పంపిణీతో పాటు వాటిని సక్రమంగా పూరించేలా సహకరిస్తున్నారు. దీంతో ఓటర్ల నుంచి కూడా మంచి స్పందన లభిస్తోంది. ఈ రెండు ప్రాంతాల్లో మొత్తం 1,440 మంది ఓటర్లకు గాను ఇప్పటికే 1,300 మందికి పైగా ఫారమ్‌లను పంపిణీ చేశారు. మిగిలిన ఓటర్లను కూడా త్వరితగతిన సంప్రదించి నమోదు ప్రక్రియను పూర్తి చేయడానికి బీఆర్ఎస్ నాయకులు, బీఎల్ఏలు క్షేత్రస్థాయిలో నిరంతరం శ్రమిస్తున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఓటు విలువైనదనే సందేశంతో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేసే దిశగా వారు ముందుకు సాగుతున్నారు.



# 104వ బోనాల ఉత్సవానికి ఆహ్వానం

**హైదరాబాద్, జూలై 07 (జనంసాక్షి) :**

శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మ దేవి శ్రీ మాతా మహంకాళి దేవి ఉమ్మడి దేవాలయాల కమిటీ నటరాజ్ నగర్ సబ్జిమండి అధ్యక్షులు శ్రీ కట్ట లింగం.. హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్, కార్పొరేటర్ స్వామి యాదవ్‌ని 104వ బోనాల ఉత్సవానికి ఆహ్వానించారు. దానికి ఎంపీ అసదుద్దీన్ సానుకూలంగా స్పందించారు. పూజా కమిటీ సలహాదారులు, గుడుమని అశోక్ కుమార్, కట్ట శ్రీనివాస్, చింత జయరాం, కలిసి ఆహ్వానించడం జరిగింది.

**తెలంగాణ స్మార్ట్ పోలీసింగ్**

# యూజింగ్ టెక్నాలజీ దిశగా తెలంగాణ పోలీస్

## బేసిక్ పోలీసింగ్‌పై దృష్టి పెట్టాలి : సమీక్ష సమావేశంలో డీజీపీ సివి.ఆనంద్







ఖమ్మం, (జనంసాక్షి) : 'తెలంగాణ స్మార్ట్ పోలీసింగ్ – యూజింగ్ టెక్నాలజీ' అనే లక్ష్యంతో పోలీస్ అధికారులు ముందుకు సాగాలని రాష్ట్ర డీజీపీ సివి. ఆనంద్ అన్నారు. ఖమ్మం జిల్లా పర్యటన లో భాగంగా మంగళవారం జిల్లాలో శాంతిభద్రతలు, నేర నియంత్రణపై ఎస్బి కాన్ఫిరెన్స్ హాల్లో సమీక్ష సమావేశం నిర్వహించారు. నేరాల నియంత్రణలో పకడ్బందీ చర్యలు, బేసిక్ పోలిసింగ్ పై దృష్టి, కీలక సంస్కరణలపై ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ...పోలీస్ యూనిఫామ్ ధరించటం అదృష్టంగా భావించి..ప్రజల భద్రతే తమ ప్రధాన లక్ష్యంగా పోలీస్ సిబ్బంది పని చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని కోట్ల మంది జనాభాలో కేవలం 0.16 శాతం మందికే ఈ అవకాశం లభిస్తుందని చెప్పారు. ఆ గౌరవాన్ని నిలబెట్టే విధంగా ప్రతి పోలీసు అధికారి ప్రజల సేవకు అంకితం కావాలన్నారు. బేసిక్ పోలిసింగ్ పై దృష్టి పెట్టాలని, రాత్రి గస్తీని మరింత బలోపేతం చేసి ఆస్తి నేరాలను అరికట్టాలన్నారు చట్టం అనేది సామాన్యులకు రక్షణ కవచంలా అండగా ఉండాలని, కానీ చట్టాన్ని చేతిలోకి తీసుకునే రౌడీలు, గూండాలకు మాత్రం కఠినమైన పోలీసింగ్ తప్పదనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. అదేవిదంగా సివిల్, భూ వివాదాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ జోక్యం చేసుకోవద్దని,లిస్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ ను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఇసుక, మట్టి మాఫియా, రౌడీషీటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీసీటీఎన్ఎస్ 3.0, హాక్ ఐ 3.0, టీజీ కాప్స్ 3.0 వంటి సాంకేతిక వేదికలను సమర్థంగా వినియోగించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఇకపై ఎఫెక్టివ్ పోలీసింగ్, స్మార్ట్ పోలీసింగ్ సమాజ శ్రేయస్సు, ప్రజలకు భరోసా ఇచ్చే దిశగా తెలంగాణ పోలీస్ ముందుకు సాగుతోందని, ఇందుకు గాను ఆధునిక టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ), సీసీ కెమెరాలు, డేటా అనలిటిక్స్, సాక్ వ్యవస్థలతో, నేరాల నియంత్రణను మరింత బలోపేతం చేస్తున్నామన్నారు. ప్రదానంగా తెలంగాణ రాష్ట్రంలో మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై కఠినంగా వ్యవహరిస్తామని డీజీపీ స్పష్టం చేశారు. ప్రస్తుతం మావోయిస్టుల కంటే గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణా పెద్ద సవాల్‌గా మారిందని పేర్కొన్నారు. డ్రగ్స్ నియంత్రణలో ఇప్పటికే ఈగల్ పోలీసు బృందాలు గంజాయి సరఫరా, రవాణా మూలలను కట్టడికి క్షేత్రస్థాయిలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నాయని చెప్పారు. "మాదకద్రవ్యాలపై యుద్ధం చేయాలి.. భావితరాలను కాపాడాలి" అని స్పష్టం చేశారు. డ్రగ్స్ ముఠాలపై నిరంతర నిఘా కొనసాగుతుందని, నేరస్తులపై పీడీ యాక్ట్ వంటి కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని, సైబర్ క్రైమ్ ఇప్పుడు పోలీసు శాఖకు ఛాలెంజ్ గా మారిందని తెలిపారు. ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి సైబర్ నేరాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. మారుతున్న పరిస్థితుల్లాగే నేరాలు జరుగుతున్న విధానం కూడా మారిందని, నేరగాళ్లు సైతం కొత్త కొత్త టెక్నాలజీని అనుసరిస్తూ నేరాలు చేస్తున్నారని, ఇది పోలీసులకు సవాలుగా మారిందన్నారు. ఇందులో విద్యావంతులు ఎక్కువ నష్టపోతున్నారని అన్నారు. తెలంగాణలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించడానికి పోలీసు యంత్రాంగం, ప్రత్యేక విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. వాహనదారులు వేగ పరిమితులు పాటించాలని, ముఖ్యంగా ప్రమాదాలు ఎక్కువగా జరిగే సమయాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు కఠినంగా అమలు చేయాలని, హెల్మెట్, సీట్ బెల్ట్ వాడకం తప్పనిసరి అని డీజీపీ స్పష్టం చేశారు. మద్యం తాగి వాహనాలు నడపడం, అతివేగం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వాడకంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు."అరైవ్ అలైవ్, డిఫెన్సివ్ డ్రైవింగ్ అవగాహన కార్యక్రమాల ద్వారా రోడ్డు ప్రమాదాలు తగ్గయని అన్నారు. రోడ్డు భద్రత కోసం ఈగల్ తరహాలో ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ బ్యూరో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో నమోదవుతున్న నేరాల ధోరణులను, వాటిలో ఉన్న లోపాలను డీజీపీ సమగ్రంగా విశ్లేషించి, దర్యాప్తు నాణ్యత, సత్వర విచారణ, సాంకేతిక వినియోగం, ప్రజల భాగస్వామ్యం పెంపుదల ద్వారా మరింత సమర్థవంతమైన పోలీసింగ్ అందించాలని అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం పోలీస్ కమిషనర్ జిల్లా పోలీసింగ్, నేరాల ధోరణులు, సాంకేతిక ఆధారిత పోలీసింగ్, ట్రాఫిక్ నిర్వహణ, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నియంత్రణ తదితర అంశాలపై ప్రజెంటేషన్ ఇచ్చారు. మాదకద్రవ్యాల నియంత్రణలో భాగంగా 2026లో 1,700 కిలోల గంజాయి, 2025లో సుమారు 4,000 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ కమిషనర్ వివరించారు. సమావేశంలో ఐజిపి చంద్రశేఖర్ రెడ్డి, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, ఈగల్ ఫోర్స్ ఎస్పీ గిరిధర్, అడిషనల్ డీసీపీలు రామానుజం, కుమారస్వామి, విజయబాబు,ఏసీపీలు వసుంధర యాదవ్, రమణమూర్తి, తిరుపతి రెడ్డి, సారంగపాణి, మహేష్, శ్రీనివాసులు, సర్వర్, సత్యనారాయణ, సుశీల్ సింగ్, నర్సయ్య పాల్గొన్నారు.



## రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొని మృతి



**శంషాబాద్,జూలై7(జనంసాక్షి) :** శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఇన్స్పెక్టర్ నరేందర్ రెడ్డి ప్రకారం పెద్దతూప్ర గ్రామానికి చెందిన డి. శ్రీనివాస్ (49) సోమవారం రాత్రి బంధువుల ఇంట్లో జరిగిన డిన్నర్ కార్యక్రమానికి హాజరయ్యాడు. అనంతరం రోడ్డు దాటుతుండగా తిమ్మాపూర్ నుంచి మహేశ్వరం వైపు వెళ్తున్న బుల్లెట్ బైక్ నెం.టిఎస్ 07జెవి9142 అతివేగంగా ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని తొలుత ఎల్ఐఎంఎస్ ఆస్పత్రికి, అనంతరం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య డి. పద్మ ఫిర్యాదు మేరకు బైక్ నడిపిన బనూరి విజయ్ అలియాస్ సంభాపై శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పేదింటి యువతి పెళ్లికి ఆర్థిక సాయం



**కేశంపేట, జూలై 7 (జనం సాక్షి ):** మండల పరిధిలోని తొమ్మిది రేకుల గ్రామానికి చెందిన బ్యాగరి సావిత్రి కేశవులు దంపతుల కుమార్తె భార్గవి పెళ్లికి గ్రామ సర్పంచ్ బీస కవిత కరుణాకర్ రెడ్డి పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందించి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. గ్రామంలో నిరుపేదలైన ఆడబిడ్డల పెళ్లికి తమ వంతుగా ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నామని సర్పంచ్ కవిత అన్నారు. అనంతరం వధువు భార్గవి కుటుంబ సభ్యులు సర్పంచ్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రంగయ్య, మాజీ ఉపసర్పంచ్ నరసింహారెడ్డి, వార్డు సభ్యులు గుత్తి చంద్రయ్య, పోగుల నర్సింలు, నరేష్, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు చిట్టి రెడ్డి వెంకట్ రెడ్డి, నాయకులు గుత్తి శేఖర్, నిరంజన్, శ్రీనివాస్ రెడ్డి, రామ్ రెడ్డి, మురళీధర్ గౌడ్, పాండు, పోగుల నర్సింలు, మల్లయ్య, మాధవయ్య, దాసరి రవి, రామచంద్రయ్య పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**కేశంపేట, జూలై 7 (జనం సాక్షి) :** మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ 32 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చిర్ర శ్రీను ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. కేక్ కట్ చేసి ఒకరికి ఒకరు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో నిర్ధవెల్లి సర్పంచ్ సి. భాస్కర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనుమగళ్ళ రమేష్ , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బీస కరుణాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల కిసాన్ సేల్ అధ్యక్షులు కోడూరు రాములు, ఎమ్మార్పీఎస్ నాయకులు గంజాయి దశరథ , గ్యార సురేష్, గోపని భీమయ్య , రామచంద్రయ్య, కిష్టయ్య, కృష్ణయ్య, యాదయ్య, కేశవులు, లక్ష్మణ్, మల్లయ్య, రాజు, రమేష్, హరి, మల్లేష్, రాజేష్, ప్రభాకర్, నాగిల్ల శంకర్, అల్వాల నరసింహ, సునీల్, దిద్దెల శివకుమార్, ముత్యాలు, రమేష్, కార్తీక్, మల్లేష్, రవికుమార్ , నవీన్ పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**నిజాంపేట్ జూలై 7 జనంసాక్షి :** నిజాంపేట్ సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ... సీఐటీయూ బాచుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిజాంపేట్ సర్కిల్ మున్సిపల్ కార్యాలయం (జీహెచ్ఎంసీ) ఎదుట మున్సిపల్ కార్మికులతో భారీ ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ కి వినతిపత్రం సమర్పించారు.

# ఘనంగా తెలంగాణ చెఫ్స్ అసోసియేషన్ వేడుకలు

### 'సురక్షితమైన ఆహారం - సురక్షితమైన దేశం'పై ప్రతిజ్ఞ, ప్యానెల్ చర్చ




**హైదరాబాద్, జూలై 07 (జనంసాక్షి)** ఆహార భద్రతను జాతీయ బాధ్యతగా చాటి చెప్పే లక్ష్యంతో ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ క్యులినరీ అసోసియేషన్స్, వరల్డ్ అసోసియేషన్ ఆఫ్ చెఫ్స్ సొసైటీస్ అనుబంధ సంస్థ తెలంగాణ చెఫ్స్ అసోసియేషన్ 7వ వార్షికోత్సవాన్ని హైదరాబాద్‌లోని తాజ్ డెక్కన్‌లో నిర్వహించారు. ఈ వేడుకలను బ్యూరో డీ ఫ్రాన్స్ హెడ్ పాస్కల్ లోరియో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'రెండేళ్ల క్రితం ఇక్కడికి వచ్చినప్పుడు, హైదరాబాద్‌లో నా మొదటి కార్యక్రమం చెఫ్ హమీల్‌ను కలవడమే. బ్యూరో ఆఫ్ ఫ్రాన్స్ అనేది ఫ్రెంచ్ దౌత్య కార్యాలయం (ఫ్రెంచ్ కాన్సులేట్) ఒక శాఖ. నేను, హమీల్ గత వారం పర్యాటక శాఖ మంత్రిని కలిశాం. హైదరాబాద్, ఫ్రాన్స్‌లోని వివిధ నగరాల మధ్య 'బోర్డో' వంటి నగరాల మధ్య జరగబోయే విభిన్న సహకారాలపై చర్చించాం. ఇది ఫ్రాన్స్‌లో వైన్ (మద్యం) రాజధాని లాంటిది. నా యువ సహోద్యోగి హ్యూగో అప్పుడే హైదరాబాద్‌లో ఒక అద్భుతమైన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎప్పుడూ హై-టెక్నాలజీ గురించే మాట్లాడుతుంటాం, నేను అన్ని విషయాలను వ్యక్తపరచాలని అనుకుంటున్నాను. ఒకరోజు మా బాస్‌తో ఇలా అన్నాను.. మనకు చాలా ముఖ్యమైన ఆర్థిక రంగం ఒకటి ఉంది. అది పర్యాటకం, హోటల్, వంటకాలు, గ్యాస్ట్రోనమీ. నేను ఇక్కడికి వచ్చి రెండేళ్లకు పైగా అవుతుంది, దీంతో నాకు ఇక్కడి స్థానిక ఆహార సంస్కృతి గురించి బాగా తెలుసు. హైదరాబాద్‌లోని అన్ని విషయాలను అన్వేషించడం నాకు చాలా సంతోషాన్ని ఇచ్చింది. ఇది నిజంగా ఒక అద్భుతమైన పర్యటన అన్నారు. ఈ సందర్భంగా అలయన్స్ ఫ్రాంకైజ్ ఆఫ్ హైదరాబాద్ డైరెక్టర్ హ్యూగో కావెట్ మాట్లాడుతూ ఈ నగరానికి వచ్చి రెండేళ్లు కావస్తోందన్నారు. చెఫ్‌లు, విద్యార్థులు చూపిస్తున్న అంకితభావాన్ని ప్రత్యక్షంగా చూశానన్నారు. గతంలో రీజెన్సీ కాలేజ్, తాజ్ గ్రూప్, తెలంగాణ చెఫ్స్ అసోసియేషన్ ప్రతినిధులతో కొన్ని కార్యక్రమాలు నిర్వహించే అవకాశం లభించిందన్నారు. గత ఫిబ్రవరిలో కొందరు చెఫ్‌లు ఇక్కడికి వచ్చి మాస్టర్‌క్లాస్‌లు నిర్వహించారని చెప్పారు. తాజ్ గ్రూప్‌తో చక్కటి డిన్నర్ కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేశామన్నారు. ఫ్రాన్స్ నైరుతి భాగంలో ఉన్న 'బోర్డో' నగరానికి ప్రాతినిధ్యం వహిస్తున్నానని చెప్పారు. తెలంగాణతో మాకు పదేళ్లకు పైగా సహకార ఒప్పందం ఉందన్నారు. ఇది ఎన్నో రంగాలకు విస్తరించిందన్నారు. కుకింగ్, గ్యాస్ట్రోనమీ, వైన్ ఈవెంట్‌లు బహుశా తెలంగాణతో మాకున్న అత్యంత విజయవంతమైన సహకార ప్రాజెక్టులలో కొన్ని కావచ్చన్నారు.



## గండిచర్ల ఎల్లారెడ్డి వర్ధంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమం

### ఘన నివాళులు అర్పించిన కుమారులు:గండిచర్ల జనార్ధన్ రెడ్డి, గండిచర్ల గోవర్ధన్ రెడ్డి

**శంకర్ పల్లి, జూలై 7 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా శంకర్పల్లి మండలంలోని పొద్దుటూరు గ్రామానికి చెందిన గండిచర్ల ఎల్లారెడ్డి పదవ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారులు గండిచర్ల జనార్ధన్ రెడ్డి (లయన్స్ ల్యాబ్ కోశాధికారి)గండి చర్ల గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో తండ్రి ఎల్లారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు అనంతరం పంజాగుట్ట లోని నిమ్స్ ఆసుపత్రిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..నాన్న పదవ వర్ధంతి సందర్భంగా నిమ్స్ ఆసుపత్రిలోని రోగులకు మరియు వారి బంధువులకు అన్నదాన కార్యక్రమం చేపట్టడం తండ్రి జ్ఞాపకాలను నిలిపినట్లు వారు తెలిపారు.మరియు నాన్న ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ వారి ఆశయ సాధనకు రాబోయే రోజులలో మరిన్ని కార్యక్రమాలను చేపడుతున్నట్లు ఈ సందర్భంగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు నర్సింలు గౌడ్, లక్ష్మి నారాయణ గౌడ్ జిల్లా సంయుక్త కోశాధికారి, జోన్ చైర్మన్ సుధీర్, వారి కుటుంబ సభ్యులు బంధువులు తదితరులు పాల్గొన్నారు.



## ఎస్సీ కార్పొరేషన్ రుణ దరఖాస్తుల పరిశీలన

**మర్పల్లి జూలై 07 (జనంసాక్షి)** 2025--26 సంవత్సరానికి సంబంధించి ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం 117 దరఖాస్తులు చేసుకున్నారని, దరఖాస్తుదారులందరికీ సమాచారం అందించి, లబ్ధిదారుల సమక్షంలో ఆయా బ్యాంకుల మేనేజర్లచే దరఖాస్తుల స్క్రూటినీ నిర్వహించమని ఎంపీడీవో శాంతమ్మ తెలిపారు. మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్, ఎస్బీఐ మర్పల్లి, ఎస్బీఐ పట్లూర్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్లు పాల్గొని దరఖాస్తులను పరిశీలించారు. 49 మంది లబ్ధిదారులు కార్యక్రమానికి హాజరయ్యారు. హాజరు కాని లబ్ధిదారుల దరఖాస్తులను కూడా పరిశీలించడం జరిగింది. స్క్రూటినీ అనంతరం అర్హుల జాబితాను సిద్ధం చేసి, తదుపరి చర్యల నిమిత్తం సంబంధిత అధికారులకు పంపడం జరిగిందని ఆమె తెలిపారు. అర్హుల జాబితాను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్, బ్యాంకుల మేనేజర్లు, ఏపీఎం సమ్మయ్య, ఎస్సీ కార్పొరేషన్ ప్రతినిధి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జిపిఓపై చర్యలు తీసుకోండి

### తాహాసిల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేసిన నిర్ధవెల్లి రైతులు

**కేశంపేట జూలై 7 (జనంసాక్షి) :** మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామ జిపిఓపై చర్యలు తీసుకోవాలని గ్రామ రైతులు తహసిల్దార్ రాజేందర్ రెడ్డి కి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. జిపిఓ వెంకటయ్య తాను చేయాల్సిన విధులకు బదులుగా వివాదాస్పద భూములలో ప్రభుత్వ సర్వేయర్ చేయాల్సిన పనులను చేస్తున్నాడని ఆరోపించారు. జిపిఓ తాను సర్వే చేసి చూపించిన హద్దుల్లో ఉండకుంటే రెవిన్యూ రికార్డుల నుండి రైతుల పేర్లను తొలగిస్తానని భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో దిద్దెల జంగయ్య, బోడ మల్లేష్, దిద్దెల ముత్యాల్, కాసాబ్ రాజేందర్, ఖాజా పాషా, సిల్వేరు రవి కుమార్ ఉన్నారు.



# ఓటర్లకు అండగా బీజేపీ ఎస్ఐఆర్

## హెల్ప్‌లైన్ సద్వినియోగం చేసుకోండి : తోకల శ్రీనివాస్ రెడ్డి



**రాజేంద్రనగర్,జూలై7(జనంసాక్షి) :** రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజలకు ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో అవసరమైన సహాయం, మార్గదర్శకత్వం అందించేందుకు బీజేపీ కార్యాలయంలో ప్రత్యేక ఎస్ఐఆర్ హెల్ప్‌లైన్ ప్రారంభించినట్లు రాజేంద్రనగర్ బీజేపీ కాంటెస్ట్ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోకల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం ప్రతి అర్హుడైన పౌరుడి ఓటు హక్కును పరిరక్షించే కీలక ప్రక్రియ అని అన్నారు. ప్రతి అర్హుడైన వ్యక్తి ఓటరుగా నమోదు కావడంతో పాటు, ఇప్పటికే ఓటరు జాబితాలో ఉన్నవారు తమ వివరాలను పరిశీలించి అవసరమైతే సవరణలు చేసుకోవాలని సూచించారు. ప్రజలకు ఎస్ఐఆర్ కార్యక్రమానికి సంబంధించిన సందేహాలు, దరఖాస్తు ప్రక్రియ, అవసరమైన పత్రాలు, ఫారాల వివరాలు, ఇతర ఎన్నికల సేవలపై సరైన సమాచారం అందించేందుకే ఈ హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ హెల్ప్‌లైన్ ద్వారా కొత్త ఓటరు నమోదు ఫాం6, ఓటరు వివరాల సవరణ ఫాం8, ఓటరు పేరు తొలగింపు ఫాం7, ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు వంటి సేవలతో పాటు ఎస్ఐఆర్ కు సంబంధించిన అన్ని అంశాలపై మార్గదర్శకత్వం అందించనున్నట్లు చెప్పారు.రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని వినియోగించుకుని, ఓటరు జాబితాలో తమ వివరాలను సరిచూసుకుని అవసరమైన మార్పులు చేసుకోవాలని కోరారు.ఎస్ఐఆర్ కార్యక్రమానికి సంబంధించిన ఎలాంటి సందేహాలు ఉన్నా 9988079999 నంబర్‌కు సంప్రదించి హెల్ప్‌లైన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని శ్రీనివాస్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.




# శంషాబాద్‌లో సిపిఐలోకి చేరికలు

**శంషాబాద్,జూలై7(జనంసాక్షి) :** శంషాబాద్ మండలంలో టీఆర్ఎస్‌తో పాటు ఇతర ప్రజాసంఘాలకు చెందిన 50 మంది సిపిఐ మండల కార్యదర్శి నర్రగిరి సమక్షంలో ఎర్ర కండువాలు కప్పుకొని సిపిఐలో చేరారు. ప్రకాష్ నగర్ కాలనీకి చెందిన దండి రవికుమార్, గోపాల్‌తో పాటు పలువురు ఈ సందర్భంగా పార్టీలో సభ్యత్వం స్వీకరించారు.ఈ సందర్భంగా నర్రగిరి మాట్లాడుతూ, పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం సిపిఐ నిరంతరం పోరాటాలు చేస్తోందని, ఇళ్లులేని వారికి 60 గజాల స్థలాలు, స్థలం ఉన్న వారికి ఇందిరమ్మ ఇళ్ల కింద రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శంషాబాద్ మండలంలోని ప్రభుత్వ భూములను గుర్తించి పేదలకు ఇంటి స్థలాల కోసం భూ పోరాటాలు చేపడతామని తెలిపారు.

# విద్యుత్ సమస్యల పరిరక్షణే ధ్యేయంగా బస్తీబాట : ఏడీఈ రాందాస్

### విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ఈసీనగర్‌లో బస్తీబాట



**కాప్రా జూలై 7 (జనం సాక్షి ) :** విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తు అందించేందుకు కాలనీల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు బస్తీబాట చేపడుతున్నామని చర్లపల్లి ఏడీఈ రాందాస్ తెలిపారు. మంగళవారం చర్లపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని ఈసీనగర్ కాలనీలో సొసైటి అధ్యక్షుడు బుడిదా శ్రావన్ కుమార్ గౌడ్ తో కలసి ఏడీఈ రాందాస్, ఏఈ బాబురావులు బస్తీబాటలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించి నాణ్యమైన విద్యుత్తు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రోజురోజుకు పెరుగుతున్న విద్యుత్ డిమాండ్కు అనుగుణంగా సబ్‌స్టేషన్లలో 12.5 పవర్ విద్యుత్ ట్రాన్స్ఫర్మర్లు ఏర్పాటు చేస్తున్నమని తెలిపారు. దీంతో విద్యుత్ సమస్యలు తలెత్తకుండ నాణ్యమైన విద్యుత్తు అందుతుందని తెలిపారు. స్థానికంగా నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నమని ఇందులో భాగంగా వారంలో ప్రతి మంగళవారం భస్తీబాట, విద్యుత్ వినియోగదారుల శిబిరం వంటి కార్యక్రమాలు చేపడుతున్నమని తెలిపారు. విద్యుత్ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు 24 గంటల పాటు తమ సబ్బంది పని చేస్తూ అందుబాటులో ఉంటారని తెలిపారు. విద్యుత సమస్యల్ పరిష్కరం కోసం 1912 నెంబర్ కు పిర్యాదు చేయవచ్చుని తెలిపారు. ఈకార్యక్రమంలో బిసి విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకుడు ముత్యం వెంకన్నగౌడ్, కాలనీవాసులు గోపాలక్రిష్ణ అనంద్రరాజుగౌడ్, మోగిలి మల్లేష్, హరిప్రసాద్, బిక్షపతి, గోవర్దన్, యాదయ్య, సంపత్ రెడ్డి,బిష్మచారీ విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

### గ్రామ సర్పంచ్ రాజు



**మర్పల్లి జూలై 07 (జనంసాక్షి)** మొక్కలు నాటడంలో ప్రతి ఒక్కరూ భాగ్యస్వాములు కావాలని తుమ్మలపల్లి గ్రామ సర్పంచ్ కర్ల రాజు అన్నారు. మంగళవారం వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల పరిధిలోని తుమ్మలపల్లి గ్రామంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా 2300 మొక్కలను ఉపాధి హామీ కూలీలతో కలిసి నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పౌరుడు ఒక మొక్కను నాటి సంరక్షించాలని అన్నారు. చెట్ల గురించి చెట్ల ప్రాముఖ్యతను గురించి పాఠ్యపుస్తకాలలో మనమంతా చదువుకున్నామని, ప్రస్తుతం అంతరించిపోతున్న అడుగులను కాపాడే బాధ్యత మన అందరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ కూలీలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు



**నిజాంపేట్ జూలై 7 జనంసాక్షి :** నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం ప్రగతి నగర్ ప్రగతి నగర్ (276) డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొమ్ము వెంకటేశ్వర్ రెడ్డి (తాతిరెడ్డి) ఆధ్వర్యంలో ప్రగతి నగర్, బాచుపల్లి నిజాంపేట్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోటపాటి మురళి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం భారీ ఎత్తున బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ చిట్ల దివాకర్, బండారు లేఔట్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వరగాని వాసు, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ నాయకురాలు రఫియా బేగం, బిక్కన్ షా, కొలన్ బల్ రెడ్డి, రాజేంద్ర, రాంచందర్ నాయక్, మొహమ్మద్, ఏరోళ్ల విష్ణు, వేణు, సురేందర్, దాసరి మహేష్,శ్రీనివాస్, మెడ శ్రీనివాస్, సయ్యద్ రఫాత్, మద్ది నారాయణ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, సోము, దాసరి మహేష్, తులసి దాస్, రాములు,ఆంజనేయ వర్మ, వీరు గౌడ్ , సాంబశివ రావు, సీనియర్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు మరియు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని కొలన్ రాజశేఖర్ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



# ఘనంగా ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు


**యాలాల జులై 7(జనంసాక్షి)** యాలాల్ మండల కేంద్రంలో మంగళవారం ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని మరియు ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మార్పీఎస్ యాలాల మండల అధ్యక్షుడు మెట్టి సూర్యప్రకాష్ మాదిగ మాట్లాడారు. 1994 జూలై 7న ప్రకాశం జిల్లా ఈదుముడి గ్రామంలో మాదిగల న్యాయమైన సమాన వాటా, ఎస్సీ వర్గీకరణ కోసం పురుడుపోసుకున్న మాదిగ దండోరా ఉద్యమం అలుపెరుగని పోరాటాలతో వర్గీకరణను సాధించిందని తెలిపారు.ఆరోగ్యశ్రీ పథకం, బియ్యం కోటా పెంపు, వృద్ధులు-వితంతువుల పెన్షన్లు, మహిళలపై అత్యాచారాల అరికట్టేందుకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల కోసం కూడా దండోరా ఉద్యమం పోరాడిందని గుర్తు చేశారు. గత 32 ఏళ్లుగా సామాజిక సమస్యలపై ప్రజా ఉద్యమాలు చేస్తూ వస్తున్నామని, భవిష్యత్తులోనూ ప్రజా సమస్యలపై పోరాడతామని అన్నారు.కార్యక్రమంలో మందకృష్ణ మాదిగకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మలిగేరి నర్సింలు, కొప్పుల నర్సింలు, నరేష్, గోపాల్, శ్రీనివాస్, శాంత్ కుమార్, మహేష్ తదితర ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణకు అందరూ సహకరించాలి



**కొడంగల్ ,జూలై 07 (జనం సాక్షి):** కొడంగల్ మున్సిపల్ కేంద్రం 237 బూత్ శాంతి నగర్ లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా బిఎల్ ఓ జానకిరామ్ ఆధ్వర్యంలో జరుగుతున్న సమగ్ర సవరణ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మాజీ కౌన్సిలర్ మధుసూదన్ యాదవ్,అరవ వ వార్డ్ కౌన్సిలర్ సయ్యద్ అమీద్, బిఆర్ఎస్ పార్టీ బిఎల్ఎ ల మున్సిపల్ కోఆర్డినేటర్ ఏరన్ పల్లి శ్రీనివాస్ గార్ల చేతుల మీదుగా ఎమ్ఎ ఖలీమ్ కు ఓటర్ జాబితా పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా బిఎల్ ఓ లకు సహకరించి పత్రాలను పూరించడంలో పార్టీలకు అతీతంగా సహకరించి,ఎటువంటి అయోమయాలకు గురికాకుండా ప్రజల అనుమానాలను నివృత్తి చేయాలని,ఓట్లు తొలిగిపోకుండా ప్రతి పౌరుడు సహకరించాలని అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో బిఎల్ఏ లు అప్పు బాయ్,జునైర్,మంగలి శేఖర్, సయ్యద్ జుబేర్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

## మందకృష్ణ మాదిగకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కొన్నింటి సురేష్



**మోమిన్ పేట జూలై 7 ( జనం సాక్షి) :** 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటం చేసి మాదిగల వర్గీకరణ సాధించిన ఘనత మందకృష్ణ మాదిగకే చెందుతుందని సర్పంచుల ఐక్యవేదిక రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొనింటి సురేష్ అన్నారు. మంగళవారం మందకృష్ణ మాదిగ పుట్టిన రోజు సందర్భంగా హైదరాబాదులోని ఆయన నివాసం వద్ద సురేష్ కలిశారు. శాలువ కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి మందకృష్ణ మాదిగకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సురేష్ ఒక ప్రకటనలో మాట్లాడుతూ..ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ 1994 సంవత్సరంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి స్థాపించి, ఎన్నో ఆందోళనలు, సభలు నిర్వహించారని తెలిపారు. ఇన్నేళ్ళు చేసిన పోరాటంలో ఏనాడు శాంతి భద్రతలకు భంగం కలిగించలేదన్నారు. అహింసా మార్గంలో అకుంఠిత దీక్షా పటిమతో ప్రభుత్వాలతో పోరాడిన ఏకైక వ్యక్తి మందకృష్ణ అని పేర్కొన్నారు. దీని ఫలితంగా దేశ అత్యుత్తమ పురస్కారాల్లో ఒకటైన పద్మశ్రీ అవార్డు ఆయనను వరించిందని చెప్పారు. కాబట్టి అటువంటి వర్గీకరణ ఫలితాలను మాదిగలు సద్వినియోగపరుచూసుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మాదిగల తరఫున మందకృష్ణ మాదిగకు పుట్టిన రోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు.

## మెట్టుగూడ, తార్నకలో అక్రమ వైన్ తయారీ భగ్నం

### రూ.50 వేల విలువైన వైన్ స్వాధీనం



**సికింద్రాబాద్( జనంసాక్షి) :** సికింద్రాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మెట్టుగూడ,, తార్నాక ప్రాంతాల్లో అక్రమంగా వైన్ తయారు చేస్తున్నారనే సమాచారంతో సికింద్రాబాద్ డీటీఎఫ్ సీఐ సౌజన్య ఆధ్వర్యంలో ఎక్సైజ్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రెండు వేర్వేరు కేసులను నమోదు చేసి, ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మెట్టుగూడలోని హౌస్ నెం. 12-7-190లో నిర్వహించిన తనిఖీల్లో 25 వైన్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిందితుడు ఆంటోనిని అదుపులోకి తీసుకున్నారు. అలాగే తార్నకలోని ఆర్టీసీ ఆసుపత్రి సమీపంలో నిర్వహించిన మరో దాడిలో అక్రమంగా తయారు చేసిన 20 లీటర్ల వైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో వేణు, ప్రకాష్ లను అరెస్టు చేశారు. స్వాధీనం చేసుకున్న వైన్ మొత్తం విలువ సుమారు రూ.50 వేలగా ఉంటుందని అధికారులు అంచనా వేశారు. నిందితులతో పాటు స్వాధీనం చేసుకున్న వైన్‌ను సికింద్రాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించి, కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

## వెంకటేష్ ఆరోపణలు రాజకీయ ప్రేరేపితమే

### సోమ శ్రీనివాస్ గుప్త



**రాజేంద్రనగర్,జూలై7(జనంసాక్షి) :** బీఆర్ఎస్ కాటేదాన్ డివిజన్ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమైనవేనని కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు, కాటేదాన్ డివిజన్ నాయకుడు సోమ శ్రీనివాస్ గుప్త విమర్శించారు. బాబుల్‌రెడ్డి నగర్‌లో అభివృద్ధి జరగలేదని చెప్పడం వాస్తవాలకు విరుద్ధమని, ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ చొరవతో డ్రైనేజీ, స్మశానవాటిక అభివృద్ధి, నర్సబాయి కుంట సుందరీకరణ, పార్కు అభివృద్ధి వంటి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. డ్రైనేజీ పైప్‌లైన్ పనులు మంచినీటి పైపులు ఎదురవడంతో తాత్కాలికంగా నిలిచాయని, సమస్య పరిష్కారమైన వెంటనే తిరిగి ప్రారంభమవుతాయని చెప్పారు. ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయ విమర్శలు మానుకుని అభివృద్ధిని గుర్తించాలని వెంకటేష్‌కు సూచించారు.

# కాంగ్రెస్ యువనేత ఏదుల శంకర్‌కు కన్నీటి వీడ్కోలు

**శంకర్ మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు • ఘన నివాళులు అర్పించిన కాంగ్రెస్ నాయకులు**



**తలకొండపల్లి జులై 07(జనంసాక్షి):** తలకొండపల్లి మండలం గట్టు ఇప్పలపల్లి గ్రామానికి చెందిన మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షులు ఏదుల శంకర్,కు కాంగ్రెస్ నేతలు,కార్యకర్తలు కడసారి కన్నీటి వీడ్కోలు పలికారు.మిడ్జిల్ మండల కేంద్రంలో ఈ నెల 4 తారీఖున జరిగిన సీఎం రేవంత్ రెడ్డి సభలో అపస్మారక స్థితిలో కింద పడిపోయారు.వెంటనే పక్కన ఉన్న కార్యకర్తలు చికిత్స నిమిత్తం హైదరాబాదులోని నిమ్స్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.బ్రెయిన్ స్ట్రోక్ తో నిమ్స్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న శంకర్ మంగళవారం ఉదయం అకాల మరణం పొందారు.కాంగ్రెస్ నేతలు శంకర్ మృతదేహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని మనసారా భగవంతుని ప్రార్థించారు.అనంతరం కుటుంబ



సభ్యులను కలిసి మనోధైర్యాన్ని కల్పించి,ప్రగాఢ సానుభూతిని తెలిపారు.పార్టీ పట్ల వారి అంకితభావం చేసిన సేవలు చిరస్మరణీయం అని కొనియాడారు.ఈ విషయం తెలుసుకొన్న నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి,కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి,ఆదేశాల మేరకు నాగర్ కర్నూల్ పార్లమెంట్ ఇంచార్జ్ ఎలుగొండ మధుసూదన్ రెడ్డి,పిసిసి సభ్యులు ఆయిల్ల శ్రీనివాస్ గౌడ్,మృతుడి నివాసానికి వెళ్లి ఏదుల శంకర్ పార్థివ దేహానికి నివాళు లర్పించారు.అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు.ఈ క్లిష్ట సమయంలో పార్టీ తరపున అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు.శంకర్ అంతిమయాత్రలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రఘురాములు,కల్వకుర్తి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పుస్తకాల రాహుల్,కడ్తాల్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శంకర్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నరసింహ,కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆవంచ నరసింహారెడ్డి,నాయకులు తిరుపతి,డేవిడ్,కాకి కృష్ణ, మహేష్, రాజు,మీసేవ మల్లేష్,రాజేందర్ నాయక్,ఆరిఫ్,జనార్దన్ రెడ్డి, వినోద్, శివ,పురుషోత్తం,పవన్ వాల్మీకి,కాంగ్రెస్ నాయకులు తరలివచ్చారు.

# పద్మశ్రీ మందకృష్ణ మాదిగ సేవలు స్ఫూర్తిదాయకం

- ఘనంగా ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం
- అట్టహాసంగా మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు



**తలకొండపల్లి జులై 07(జనంసాక్షి):** మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి 32వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా,ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ 61వ జన్మదిన వేడుకలను తలకొండపల్లి మండల కేంద్రంలో బస్టాండ్ వద్ద ఘనంగా నిర్వహించారు.తలకొండపల్లి ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు తుడుం శ్రీనివాస్ మాదిగ,జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి శ్రీకాంత్ మాదిగ,రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ జెండాను ఎగురవేసి,బాణాసంచా పేల్చారు.అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.అనంతరం ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ..మాదిగ రిజర్వేషన్ పోరాట సమితిని స్థాపించి 32 సంవత్సరాలుగా సామాజిక న్యాయం,మాదిగల హక్కుల పరిరక్షణ,రిజర్వేషన్ సాధన కోసం పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నిరంతరం పోరాటం చేస్తున్నారని కొనియాడారు.ఆయన సేవలు మాదిగ సమాజానికి స్ఫూర్తిదాయకమని పేర్కొంటూ,ఆయురారోగ్యాలతో మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవ కొనసాగించాలని ఆకాంక్షిస్తూ,జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అవగాహన,హక్కుల చైతన్యము లేని ఆత్మనున్యతతో బాధపడే జాతుల్ని ఒక్కటి చేసి లక్షలాది మందిని కదిలించి పోరాటాల ద్వారానే పాలకుల మెడలు వంచి వర్గీకరణ ఫలాలు జాతికి అందించిన మహానుభావుడని పేర్కొన్నారు.మన వర్గాలు అభివృద్ధి చెందేలా ఐక్యతతో మందకృష్ణ మాదిగ సారథ్యంలో ముందుకు నడువాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి కిరణ్ పులే మాదిగ,ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షులు పెరుమండ్ల కుమార్ మాదిగ,తలకొండపల్లి ఉప సర్పంచ్ నుకం కోటిశ్వర్,మాజీ సర్పంచ్ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పేరుమండ్ల జోతయ్య,మాజీ ఉప సర్పంచ్ పద్మ అనిల్,తూర్పు శ్రీను మాదిగ,బీజేపీ నాయకులు శేఖర్ రెడ్డి,పోతుగంటి మల్లేష్,పెరుమండ్ల నారాయణ,పోతుగంటి గణేష్,నర్సిహ్మా,శ్రీను,ఎమ్మార్పీ మాజీ అధ్యక్షులు పోతుగంటి కుమార్,దర్వుల రాజు,పాండు,గోపాల్,మీసాల మహేష్, రాములు, బాలస్వామి, సంతోష్,పోతుగంటి సురేష్,విద్యార్థులు,యువకులు తదితరులు పాల్గొన్నారు.



## భార్యను చంపిన భర్తకు యావజ్జీవ శిక్ష




**మల్కాజిగిరి జూలై 7 (జనంసాక్షి) :** అదనపు వరకట్నం కోసం, అనుమానంతో భార్యను గొంతు నులిమి హత్య చేసిన నిందితుడికి కోర్టు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చింది. నేరెడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటనపై సిఐ వెంకటయ్య ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించారు.సంగారెడ్డి జిల్లా నల్కల్ మండలం టేకూర్ గ్రామానికి చెందిన పోలీస్ పట్లోళ్ల పోలీస్ పటేల్ బస్వలింగప్ప (41) నేరెడ్‌మెట్ పరిధిలోని జెజె నగర్‌లో నివసిస్తున్నాడు.ఇతనికి 2018లో పెద్దల సమక్షంలో వివాహమైంది. పెళ్లి సమయంలో మృతురాలి తల్లిదండ్రులు కట్నకానుకలుగా నగదు, బంగారం ఇచ్చారు. అయితే, వివాహమైన కొన్ని నెలల నుంచే బస్వలింగప్ప అదనపు వరకట్నం కోసం భార్యను మానసికంగా, శారీరకంగా హింసించడం ప్రారంభించాడు.భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకుని వేధించేవాడు.ఈ క్రమంలోనే 2021 ఆగస్టు 14వ తేదీ రాత్రి నిందితుడు మద్యం తాగి ఇంటికి వచ్చి, భార్యతో గొడవ పడ్డాడు. తీవ్ర ఆగ్రహంతో ఆమెను గొంతు నులిమి దారుణంగా హత్య చేశాడు. అనంతరం ఆ నేరం నుంచి తప్పించుకునేందుకు, ఆమె ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లుగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడు.ఘటనపై కేసు నమోదు చేసుకున్న నేరెడ్‌మెట్ పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు జరిపి, కోర్టులో పక్కా ఆధారాలతో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ అనంతరం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జ్ బాల భాస్కర్ నిందితుడిని దోషిగా నిర్ధారించారు. నిందితుడు బస్వలింగప్పకు యావజ్జీవ కఠిన కారాగార శిక్షతో పాటు1,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.ఈ కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నరసింహా స్వామి కోర్టులో ప్రభుత్వం తరపున బలమైన వాదనలు వినిపించిన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జివి రామకృష్ణ రావులను అధికారులు అభినందించారు.అలాగే కోర్టు విచారణ విజయవంతం కావడానికి సమన్వయంతో కృషి చేసిన సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

## పెట్రోల్  డీజీల్ , గ్యాస్ ధరలు తగ్గించాలి జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలి

### ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి
### సీఐటీయూ ఆటో ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల సంఘం

**అంబర్పేట్ జులై 7 (జనంసాక్షి) :** సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా అంబర్పేట జోన్ కోరంటి చౌరస్తాలో ఆటో ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు నగర ఉపాధ్యక్షులు జి.రాములు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను నిరంతరం పెంచుతూ సామాన్య ప్రజలపై, ముఖ్యంగా ఆటో కార్మికులపై తీవ్ర ఆర్థిక భారం మోపుతోందన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినప్పుడు అదే స్థాయిలో దేశీయంగా ఇంధన ధరలు తగ్గించకపోవడం అన్యాయమని విమర్శించారు. పెట్రోల్, డీజిల్‌ను వెంటనే జీఎస్టీ పరిధిలోకి తీసుకువచ్చి ప్రజలకు అందుబాటు ధరలకు అందించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధిస్తున్న అధిక పన్నులను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులు పెరుగుతున్న ఇంధన ధరలు, విడిభాగాల ధరలు, వాహన నిర్వహణ ఖర్చులు, బీమా, ఫిట్‌నెస్, పర్మిట్, ఇతర రుసుముల పెరుగుదలతో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రోజంతా కష్టపడి పనిచేసినా కుటుంబ పోషణ కూడా భారంగా మారిందన్నారు. ఆటో కార్మికుల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, పెన్షన్, ఆరోగ్య బీమా, ప్రమాద బీమా, పిల్లల విద్యా సహాయం,




ప్రసూతి ప్రయోజనాలు, గృహ సౌకర్యాలు వంటి సంక్షేమ పథకాలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రైవేట్ ఓలా ఉబర్ యాప్ లను రద్దుచేసి ప్రభుత్వం యాప్ ను తీసుకురావాలని వారి డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే ఈ సమస్యలపై స్పందించి ఆటో కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు, డిఎల్ మోహన్, అంబర్పేట జోన్ కమిటీ సభ్యుడు లంక. సోమయ్య, ఆలిండియా ట్రాన్స్పోర్ట్ రంగం నగర కమిటీ సభ్యుడు బి లక్ష్మణ్, బాబూరావు, జంగయ్య, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## పేదల కంటి వెలుగుకు-సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి భరోసా

### నాల్గొవ రోజుకు చేరుకున్న మెగా ఉచిత కంటి వైద్య శిబిరం సేవలు
### ప్రారంభమైన ఉచిత కంటి శుక్లాల శస్త్రచికిత్సలు
### 29 మంది కంటి శుక్లాల పేషెంట్లకు విజయవంతంగా సర్జరీలు పూర్తి
### ఐక్యత పౌండేషన్ చైర్మన్ టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

**తలకొండపల్లి జూలై 07(జనంసాక్షి):** గ్రామీణ ప్రాంత నిరుపేదలకు నాణ్యమైన ఉచిత కంటి వైద్యాన్ని అందించి మెరుగైన కంటి చూపును ప్రసాదించడమే తమ లక్ష్యం అని టాస్క్ సీఓఓ ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు.తలకొండపల్లి మండల కేంద్రంలో ఐక్యత పౌండేషన్ ఆధ్వర్యంలో గత నాలుగు రోజుల నుంచి ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతంగా కొనసాగుతుంది.ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మంగళవారం సందర్శించి మాట్లాడారు..పేద ప్రజలకు ఖరీదైన కంటి శుక్లాల సర్జరీల పక్రియను ఉచితంగా మన కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలకు అందించాలనే సంకల్పంతో ప్రముఖ వైద్య నిపుణులు శంకర నేత్రాలయ చెన్నై వారిని అందుబాటులోకి తెచ్చామని,ఆర్థిక ఇబ్బందుల వల్ల ఎవరూ వైద్యానికి దూరం కాకూడదనే సంకల్పంతో ఐక్యత ఆరోగ్య భరోసా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు.ప్రజల నుంచి వస్తున్న విశేష స్పందన తమపై మరింత బాధ్యతను పెంచిందని,భవిష్యత్తులో ఇంకా పెద్ద ఎత్తున గ్రామాల్లో ఇలాంటి ఉచిత ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తామని తెలిపారు.కంటి వైద్య శిబిరంలో దాదాపు 1000 మందికిపైగా శిబిరాన్ని సందర్శించగా,630 మందికిపైగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహణ పూర్తి చేసామని,382 మందికిపైగా ఉచిత కంటి అద్దాలు పంపిణీ,30 మంది కంటి శుక్లాల శస్త్రచికిత్సలు చేసినట్లు తెలిపారు.ఈనెల 10వ తారీఖుతో ముగియనున్న కంటి పరీక్షలు,12వ తారీఖు వరకు కంటి ఆపరేషన్ల ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు.శిబిరాన్ని సందర్శించిన పలువురు గ్రామాల సర్పంచ్‌లు మాట్లాడరు.సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని అభినందించారు.గ్రామీణ నిరుపేదలకు ప్రముఖ వైద్యుల సేవలను ఉచితంగా అందించడం గొప్ప సేవ అని కొనియాడారు.కంటి పరీక్షలు,ఉచిత కంటి అద్దాలు,ఉచిత శస్త్రచికిత్సలు నిర్వహించడం ద్వారా వేలాది కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతోందని




పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు వీరేష్,మల్లేష్,దాస్ నాయక్,కళ్యాణ్ నాయక్,ఉపసర్పంచ్‌లు రమేష్ యాదవ్,మాజీ సర్పంచ్ లు బాల్ రాజ్,నరేందర్ గౌడ్,శ్రీరాములు,మాజీ ఉప సర్పంచ్ లు హట్య నాయక్,ఐక్యత ఫౌండేషన్ సభ్యులు రఘు,యాదయ్య,విజయ్ కుమార్,శ్రీపతి,శేఖర్,బాస్కర్,సాయి కిరణ్,శంకర నేత్రాలయ వైద్య బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## జూలై 10 విద్యా బంద్‌ను విజయవంతం చేయాలి

### ఫీజు నియంత్రణ చట్టం, ప్రభుత్వ విద్య బలోపేతానికి వామపక్ష విద్యార్థి సంఘాల డిమాండ్

**ముషీరాబాద్, జూలై 7 (జనం సాక్షి):** ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావడంతో పాటు ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని డిమాండ్ చేస్తూ జూలై 10న నిర్వహించనున్న విద్యా బంద్‌ను విజయవంతం చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఏఐడీఎస్ఓ నాయకులు మాట్లాడుతూ... విద్యారంగ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం 27 వేల ప్రభుత్వ పాఠశాలలను 3 వేలకే పరిమితం చేయాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు టిఫిన్, పౌష్టికాహారం, రెండు జతల యూనిఫాంలు అందించడంతో పాటు పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. అలాగే ఖాళీగా ఉన్న ఎంఈవో, డీఈవో, డీఐఈవో పోస్టులను భర్తీ చేయాలని, అద్దె భవనాల్లో నడుస్తున్న సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించి సీట్ల సంఖ్య పెంచడంతో పాటు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు అశోక్ రెడ్డి, లెనిన్ గువేరా, అనిల్, శ్రీను, హరీష్, నాగరాజు, వంశీ, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మి నరసింహా స్వామి కాలనీలో మెరుగైన మౌలిక వసతుల కల్పనే ప్రధాన లక్ష్యం

### ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**కాప్రా, జూలై 7 ( జనం సాక్షి ) :** నియోజకవర్గం లోని ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం కుషాయిగూడ డివిజన్ పరిధిలోని శ్రీ లక్ష్మి నరసింహ స్వామి కాలనీ లో కాలనీ అధ్యక్షులు జె సుధాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాలనీ విజిట్ కార్యక్రమం లో కాలనీ వాసులతో కలిసి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పర్యటించారు. కాలనీవాసులు కాలనీలో ఉన్న విద్యుత్ లైన్ లను, సింగల్ ఫేస్ నుండి త్రీ ఫేస్ కి మార్చాలని, పోల్స్ షిఫ్టింగ్ చేయాలని, స్ట్రీట్ లైట్స్ మార్చాలని, సీసీ రోడ్లు, డ్రైనేజీ, బంగారు మైసమ్మ దేవాలయం అభివృద్ధి, పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్ళి, వినతి పత్రంను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ దృష్టికి వచ్చిన కాలనీల సమస్యలను సంబంధిత అధికారులకు దృష్టికి తీసుకెళ్లి వారితో సమన్వయం చేపిస్తూ, ఎలక్ట్రికల్ ఏ డి తో ఫోన్ లో మాట్లాడి విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలనీ, సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో శ్రీ లక్ష్మి నరసింహ స్వామి కాలనీ సెక్రటరీ అఖిల్, ఉపాద్యాక్షులు పి శ్రీనివాస్, బి కృష్ణ, సహాయ కార్యదర్శులు మునీర్, మల్లేష్, ట్రజారర్ ఎ శ్రీనివాస్, సలహాదారులు పరమేష్, కాలనీ సభ్యులు కె అరుణ్, మాదేశ్, శివ కృష్ణ, కిరణ్, ప్రసాద్, ఎస్ కృష్ణ, రాజేష్, దామోదర్, ఎస్ రామచందర్, రామస్వామి, రాజయ్య, శ్రీనివాస్, శ్రీధర్, రాజు, చర్లపల్లి కంటెస్టెంట్ కార్పొరేటర్ మహేష్ గౌడ్, సీసీఎస్ కాలనీల అధ్యక్షులు పద్మారెడ్డి, కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# పీఆర్సీని వెంటనే ప్రకటించాలి

- పిఆర్టియు జిల్లా అధ్యక్షులు సామల మహేందర్ రెడ్డి
- టీచర్లకు భోజనాలు, టిఫిన్లు కాదు
- పిఆర్సీని ప్రకటించాలి



**షాబాద్, జులై 7 (జనం సాక్షి):** పిఆర్టియు షాబాద్ మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మెంబర్‌షిప్ క్యాంపెయిన్ కార్యక్రమంలో పిఆర్టియు జిల్లా అధ్యక్షులు సామల మహేందర్ రెడ్డి పాల్గొని, మండలంలోని పలు ఉన్నత పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఉపాధ్యాయులకు భోజనాలు, టిఫిన్లు అందిస్తామని ప్రభుత్వం ప్రకటించడం కంటే, ఉపాధ్యాయుల ప్రధాన సమస్యలను పరిష్కరించడంపై దృష్టి సారించాలని అన్నారు. ముఖ్యంగా మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పీఆర్సీని వెంటనే ప్రకటించి అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే నూతన హెల్త్ స్కీమ్ ద్వారా రాష్ట్రంలోని అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉపాధ్యాయులు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకుండా నాణ్యమైన వైద్యం పొందేలా వెంటనే హెల్త్ కార్డులను జారీ చేయాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేసి, ఓల్డ్ పెన్షన్ స్కీమ్ ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్‌ను వెంటనే నిర్వహించి, దసరా నాటికి ప్రమోషన్లతో కూడిన బదిలీలను పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి కొనగారి కృష్ణారెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షులు పెద్దమారు రాఘవేందర్, షాబాద్ మండల అధ్యక్షులు డేవిడ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణ,రాష్ట్ర బాధ్యులు లంబాడినర్సింలు,సుశీల, ప్రవీణ్ కుమార్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బాలరాజ్, జిల్లా బాధ్యులు రాంచెందర్, బి.ఎన్,మాధవరెడ్డి, మండల బాధ్యులు అంజయ్య, ఖాజపాష, జైపాల్ రెడ్డి, అశోక్, గోవింద్ పాల్గొన్నారు.

## సెయిలింగ్‌లో కాంస్యం సాధించిన హర్షవర్ధన్‌కు సన్మానం

- అంతర్జాతీయ వేదికపై మెరిసిన యువకుడు
- హర్షవర్ధన్‌ను సన్మానించిన ఆర్బిఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి



**తాండూరు జులై 7జనంసాక్షి :** గ్రామీణ క్రీడా ప్రతిభ అంతర్జాతీయ వేదికపై మెరిసింది. భారతదేశం తరుపున అంతర్జాతీయ సెయిలింగ్ పోటీల్లో పాల్గొని కాంస్య పతకం సాధించిన గాజీపూర్ గ్రామానికి చెందిన ఎర్రా హర్షవర్ధన్‌ను ఆర్బిఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి ఘనంగా సన్మానించారు. అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు రూ. 1,50,000 ఆర్థిక సహాయం అందించిన బుయ్యని శ్రీనివాస్ రెడ్డికి హర్షవర్ధన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సహాయంతోనే తాను పోటీల్లో పాల్గొని పతకం సాధించగలిగానని ఆయన అన్నారు. ఈ సందర్భంగా బుయ్యని శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా ప్రతిభకు కొదవలేదని, సరైన ప్రోత్సాహం ఉంటే యువకులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తారని పేర్కొన్నారు. యువకులు క్రీడల్లో రాణించాలని, వారికి అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. హర్షవర్ధన్ విజయం గ్రామీణ యువతకు స్ఫూర్తిదాయకమని, భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, క్రీడా ప్రేమికులు పాల్గొన్నారు.

## రతన్ కాలనీలో ప్రత్యేక ఓటరు సవరణ
# కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్



**ఫరూఖ్ నగర్, జనంసాక్షి :** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని 22వ వార్డు రతన్ కాలనీలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక కౌన్సిలర్, బూత్ స్థాయి అధికారులు, కాలనీవాసులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటరు నమోదు, సవరణ ప్రక్రియపై వివరాలు తెలియజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరుగా నమోదు కావడం బాధ్యతగా భావించాలని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల అమలులో ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఓటర్ల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధితో పాటు ప్రజల్లో సామాజిక చైతన్యం పెంపొందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం ద్వారా పాత ఓటరు వివరాలను నవీకరించి, తప్పులను సరిచేసే అవకాశం కల్పించిందన్నారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వచ్చి అందించే దరఖాస్తు పత్రాల్లో పేరు, ఇంటి నంబర్, ఓటరు గుర్తింపు కార్డు సంఖ్య, ఆధార్ వివరాలను సరైన విధంగా నమోదు చేయాలని సూచించారు. కొత్తగా ఓటరుగా నమోదు కావాలనుకునే యువత తప్పనిసరిగా దరఖాస్తులు సమర్పించాలని కోరారు. ఇల్లు మారిన వారు, పేరు లేదా ఇతర వివరాల్లో మార్పులు అవసరమైన వారు సవరణ దరఖాస్తులు అందజేయాలని, దరఖాస్తు సమర్పించిన తర్వాత అధికారులు ఇచ్చే రసీదును భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. రతన్ కాలనీలో ఒక్క అర్హుడైన ఓటరు కూడా జాబితా వెలుపల ఉండకూడదని, ప్రతి కుటుంబం ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 22వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ నడికూడ అనితా రఘునాథ్ యాదవ్, బూత్ స్థాయి ప్రతినిధులు, కాలనీ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు అబినందనియం.

### గ్రామ సర్పంచ్ సి.హెచ్. శివయ్య.




**యాలాల జులై 7 (జనంసాక్షి):** మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హైదరా బాద్‌కు చెందిన శంకర కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ సి. హెచ్. శివయ్య ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మల్కి రెడ్డి శోభరాజు రెడ్డి, 12వ వార్డు సభ్యుడు ఉమేష్, గ్రామ కమిటీ అధ్యక్షులు రాపోల్ నాగయ్య, కార్యదర్శి హైమద్, బుర్జపూరి నర్సింహులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ శివయ్య మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో కంటి సమస్యలతో బాధపడే వారికి ఉచిత వైద్య సేవలు అందించేందుకు శంకర ఆస్పత్రి ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రజలు కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. శిబిరంలో వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కంటి శస్త్ర చికిత్స అవసరమైన వారిని హైదరాబాద్ శంకర ఆస్పత్రికి ఉచితంగా తరలించి చికిత్స అందిస్తామని వారు పేర్కొన్నారు. ఈ శిబిరంలో పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఆస్పత్రి సిబ్బందికి, గ్రామ కమిటీ సభ్యులకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

### శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద అన్న ప్రసాద వితరణ

**శామీర్ పేట, జూలై 7(జనం సాక్షి) :** శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్న ప్రసాద వితరణ చేపట్టారు. మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళ వారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద శామీర్ పేట గౌడ సంఘం ఆధ్వర్యం లో అన్నదానం చేపట్టగా శామీర్ పేటకు చెందిన బండి బాల్ రాజ్ గౌడ్ మహేశ్వరి దంపతులు, శావర్తి గణేష్ వారి కుటుంబ సభ్యులు అన్న దానానికి సహకరించారు. ఎల్లమ్మ తల్లి ఆలయానికి విచ్చేసే భక్తులు, మాజీ ప్రజా ప్రతినిధులు, రాజీవ్ రహదారి పై వెళ్లే భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

## ఇల్లు కూలిన కుటుంబానికి
# డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలి

### బిఆర్ఎస్ పార్టీ నాయకులు డిమాండ్



**యాలాల జులై 7 (జనంసాక్షి) :** ట్యాంకు డిస్మెంటల్ చేస్తుండగా ప్రమాదవశాత్తు ఇల్లు కూలిపోవడంతో నిరాశ్రయులైన కుటుంబానికి వెంటనే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించాలని బిఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తిమ్మాయిపల్లి గ్రామంలో సుమారు 65 సంవత్సరాల క్రితం నిర్మించిన పాత ట్యాంకు శిథిలావస్థకు చేరుకోవడంతో దానిని కూల్చివేసేందుకు శనివారం ప్రభుత్వ అధికారులు వచ్చారు. డిస్మెంటల్ పనులు చేస్తుండగా భారీ శిథిలాలు ఉరడి రాములమ్మ (60) ఇంటిపై పడ్డాయి. ఈ ప్రమాదంలో రాములమ్మ ఇల్లు పూర్తిగా కూలిపోయింది. గోడలకు పెద్ద పెద్ద పగుళ్లు ఏర్పడి, సీలింగ్ పెచ్చులు ఊడిపడుతున్నాయి. ఇంట్లోని సామాన్లు అన్నీ దెబ్బతిన్నాయి. నిల్వ ఉంచిన బియ్యంలో మట్టి, రాళ్లు కలిసిపోయాయి. బాధితురాలు రాములమ్మకు భర్త ఇప్పటికే మరణించారు. ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడు నవీన్ దివ్యాంగుడు కాగా, పెద్ద కుమారుడు రమేష్ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన తిమ్మాయిపల్లి బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు ప్రభుత్వ అలసత్వం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఆరోపించారు. బాధిత కుటుంబానికి తక్షణమే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేయాలని, ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కృష్ణకుమార్, కురువ కిష్టప్ప, వంగ శ్రీనివాస్ రెడ్డి, కోర్వాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఐకమత్యంతో కాలనీ అభివృద్ధికి నూతన కమిటీ కృషి చేయాలి

- న్యూ మారుతి నగర్ కాలనీ సంక్షేమ సంఘం
- నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం



**హయత్ నగర్, జులై 7 (జనం సాక్షి) :** సాహెబ్ నగర్ డివిజన్ పరిధిలోని న్యూ మారుతి నగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరిగింది. కాలనీ గణేష్ మండపంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జాగృతి అభ్యుదయ సంఘం చైర్మన్ భావన శ్రీనివాస్ సభాధ్యక్షుడిగా హాజరై, నూతన కమిటీ సభ్యులతో ప్రమాణం చేయించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో గౌరవ అధ్యక్షుడు ఎస్.కే. అహ్మద్ హుస్సేన్, అధ్యక్షురాలు కె. విజయలక్ష్మి, ప్రధాన కార్యదర్శి యు. నరసింహ, కోశాధికారి సి.హెచ్. అనిల్, కార్యవర్గ సభ్యుడు జిలాని, సలహాదారులు ఎస్.ఎన్. షరీఫ్, సత్యనారాయణ, సంతోష్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు కె. విజయలక్ష్మి మాట్లాడుతూ కాలనీలో రాజకీయాలకు, వర్గ పోరాటాలకు తావివ్వకుండా భూగర్భ డ్రైనేజీ, రహదారులు, వీధి దీపాలు వంటి కనీస సౌకర్యాల కల్పనతో పాటు పచ్చదనాన్ని పెంపొందించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తామని తెలిపారు. కాలనీవాసులు, కమిటీ సభ్యుల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు.

గాయత్రి నగర్ ఫేజ్-4 అధ్యక్షుడు మనోజ్ గౌరిశెట్టి మాట్లాడుతూ కాలనీ సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే స్థానిక ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమ సమన్వయకర్త, బ్లడ్ క్రాస్ సొసైటీ సీఈఓ డాక్టర్ విజయకుమార్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రలోభాలకు గురికాకుండా పార్టీలకు అతీతంగా ప్రజలకు సేవ చేసే అభ్యర్థులను ఎన్నుకోవాలని, కాలనీ అభివృద్ధే లక్ష్యంగా ఐకమత్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. గాయత్రి నగర్ ప్రతినిధి నీనా భవాని మాట్లాడుతూ శివారు ప్రాంతాల్లో మద్యం, గంజాయి సేవిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి సాహెబ్ నగర్ డివిజన్ లోని పలు కాలనీల ప్రతినిధులు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. నాగిరెడ్డి కాలనీ, గాయత్రి నగర్ ఫేజ్-1, ఫేజ్-3, శ్రీ వెంకటేశ్వర కాలనీ, పి.వి.ఆర్. కాలనీ ప్రతినిధులతో పాటు గూడూరు వెంకటేష్, సోమయాజులు, వెంకటేశ్వరరావు, రాధా విష్ణుమోహన్, రాజు గౌడ్, పి. కృష్ణ, ఉషారాణి, గౌరీ శంకర్, దుర్గా మంగపతి, పావని కిరణ్, జి. రాము తదితరులు పాల్గొన్నారు.

# 70కుపైగా చోరీ కేసుల్లో నిందితుడు అరెస్ట్

- 42.3 తులాల బంగారం, 87 తులాల వెండి, రూ.42 వేల నగదు స్వాధీనం



**హయత్‌నగర్, జూలై 7 (జనం సాక్షి) :** పగటి పూట తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని వరుస గృహ చోరీలకు పాల్పడుతున్న ఓ సీరియల్ నేరస్థుడిని హయత్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి సుమారు 42.3 తులాల బంగారు ఆభరణాలు, 87 తులాల వెండి వస్తువులు, రూ.42 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మునగానూరు వద్ద సోమవారం అనుమానాస్పదంగా సంచరిస్తున్న శ్రీరామ్ నరసింహ చారి అలియాస్ నయామి అలియాస్ రాజేష్ (39), చింతల్‌కు చెందిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా, హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల నమోదైన నాలుగు గృహ చోరీ కేసులతో పాటు పలు చోరీలకు పాల్పడినట్లు అంగీకరించాడు. నిందితుడు గతంలోనూ తెలంగాణలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో 70కుపైగా గృహ చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అనేకసార్లు జైలుకు వెళ్లి బెయిల్‌పై విడుదలైన తర్వాత కూడా మళ్లీ అదే తరహా నేరాలకు పాల్పడుతున్నట్లు వెల్లడించారు. ఇటీవల మునగానూరు, ద్వారక వెంకటసాయి నగర్, హయత్‌నగర్ ప్రాంతాల్లో తాళం వేసిన ఇళ్లలో చోరీలకు పాల్పడి బంగారు, వెండి ఆభరణాలు, నగదును అపహరించినట్లు విచారణలో తేలింది. దొంగిలించిన ఆస్తిలో కొంత భాగాన్ని విక్రయించి వచ్చిన నగదును ఆన్‌లైన్ బెట్టింగ్‌కు ఖర్చు చేసినట్లు నిందితుడు ఒప్పుకున్నాడని పోలీసులు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి ఆభరణాలు, నగదును బాధితులకు అప్పగించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. నిందితుడిపై నమోదైన ఇతర కేసుల వివరాలను కూడా సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కేసును ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసి, దొంగిలించిన ఆస్తిని స్వాధీనం చేసుకున్న హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సి.హెచ్. శంకరయ్య, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ డి. సంతోష్ కుమార్, వనస్థలిపురం ఏసీపీ పి. కాశిరెడ్డి, క్రైమ్ స్టాఫ్ సిబ్బందిని ఎల్‌బీ నగర్ జోన్ డీసీపీ బి. అనూరాధ అభినందించారు.

## నవాబుపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా వైద్య అధికారి సుధాకర్ లాల్..!!



**నవాబుపేట్ జూలై 7 ( జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలోనీ ప్రభుత్వ వైద్య ఆస్పత్రుల్లో ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉండి వైద్య పరీక్షలు అందించాలని మంగళ వారం నవాబు పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. మండల పరిధిలోని ఉన్నటువంటి వివిధ గ్రామాల నుండి ఆసుపత్రికి వచ్చిన ప్రజలకు ఎల్లవేళలా సేవలు అందించాలని ఆయన పేర్కొన్నారు. ఆస్పత్రిలో ప్రజలకు కావలసిన చికిత్సలు చేసి మెడిసిన్ అందించాలన్నారు. ఆసుపత్రికి కావలసిన సదుపాయాలను అందించే విధంగా చేస్తానని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం మండల పరిధిలోని వివిధ గ్రామాల ఆశ వర్కర్ల సమావేశం నిర్వహిస్తుండగా అక్కడ హాజరై వారితో మండల పరిధిలోని గ్రామాలలోని ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గత 15 రోజుల నుండి భారీ వర్షాలు కురుస్తున్న సందర్భంగా గ్రామాలలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బ్లీచింగ్ పౌడర్, అందజేసినట్లు అయితే అలాగే నీటిలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రజలు సుఖ సంతోషాలతో ఉంటారని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది మండలంలోని ఉన్నటువంటి సబ్ సెంటర్లలో స్టాపు అందుబాటులో ఉండి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలకుండా ఆరోగ్యానికి ఎలాంటి హానికరం లేకుండా కావలసిన మందులను అందించే విధంగా చూడాలని ఉన్నారు. మండలంలోని ఉన్నటువంటి గ్రామాలలో వైద్యం పరీక్షలు భారీ వర్షాలు రావడంతో ప్రజలకు సూపర్వైజర్లు ఏఎన్ఎంలు అందుబాటులో ఉండి అయితే పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. ఆసుపత్రిలో ప్రజలకున్ని సదుపాయాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆసుపత్రిని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ప్రతి ఉద్యోగి సమయపాలన పాటించి ప్రజల సమస్యలు ఎల్లవేళలా తీర్చిదిద్దే విధంగా పనిచేయాలని మండల పరిధిలోని ఏ గ్రామంలోనైనా ప్రజలకు మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్ స్క్రీనింగ్ 100% పూర్తిచేయాలని తెలిపారు. వారికి కావలసిన ఆరోగ్యవంతమైన పరీక్షలు చేసి వారికి ఎలాంటి ఇబ్బందులు మందులను అందించే విధంగా ప్రయత్నం చేయాలని మండల వైద్యాధికారి రోహిత్ కు ఆదేశాలు జారీ చేశారు. మండలంలోని ఎలాంటి అవకత జరిగిన వెంటనే నాకు సమాచారం ఇవ్వాలని లేనిలా మీ పైన కఠినమైన చర్యలు తీసుకోబడుతుందని తెలిపారు. ముందుగా పాఠశాలల్లోని ఉన్నటువంటి ప్రతి విద్యార్థికి వర్షాకాలం కారణంగా వారికి కావలసిన మందులను అందించే విధంగా సూపర్వైజర్లు ఏఎన్ఎంలు చూడాలని తెలిపారు. ఆసుపత్రి లో ఎలాంటి ఇబ్బందులు ఉన్న ప్రజలకు కావలసిన పరికరాలను ఏర్పాటు చేసే విధంగా ప్రయత్నం చేద్దామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం లో మండల వైద్య అధికారి రోహిత్, సిహెచ్ఓ శివరాజ్, సూపర్వైజర్లు, సుగుణ, శోభ, ఏఎన్ఎంలు, సిబ్బందిఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

## వెంకటాపూర్ గ్రామంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



**మొయినాబాద్,జూలై07, జనంసాక్షి:** మొయినాబాద్ మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో కమాన్ నుండి బొడ్రాయి వరకు సీసీ రోడ్డు పనులను గ్రామ సర్పంచ్ అర్చన-అజయ్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. సీసీ రోడ్డు పనులకి 20 లక్షల హెచ్ఎండీఏ నిధులు చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య మంజూరు చేశారు. గ్రామ సర్పంచ్ అర్చన అజయ్ రెడ్డి సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాన్ని దశలవారీగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని అన్నారు. గ్రామంలో ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. గ్రామ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సర్పంచ్ ఎలుగుల ప్రభాకర్, వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్లు, మాజీ ఉపసర్పంచ్లు, మాజీ వార్డు సభ్యులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఇందిరమ్మ కమిటీసభ్యులు, మత్స్యకారుల సంఘం ప్రధాన కార్యదర్శి పాల్గొన్నారు.

## నగాసముందర్ గ్రామంలో వీధి దీపాల ఏర్పాటు

**ధారూర్ జూలై 07(జనంసాక్షి) :** మండల పరిధిలోని నగాసముందర్ గ్రామంలో గ్రామాభివృద్ధిలో భాగంగా నూతన వీధి దీపాలను గ్రామ సర్పంచ్ కొలి వెంకటేశ్వర్ ఏర్పాటు చేయించారు. గ్రామంలోని ప్రధాన రహదారులు,కాలనీలు, ప్రజలు అధికంగా రాకపోకలు సాగించే ప్రాంతాల్లో వీధి దీపాలను ఏర్పాటు చేయడంతో రాత్రి వేళల్లో వెలుతురు సౌకర్యం మెరుగుపడిందనీ వీధి దీపాల ఏర్పాటు వల్ల గ్రామంలో రాత్రి సమయంలో ప్రయాణికులు, మహిళలకు భద్రత పెరగడంతో పాటు ప్రజలు సౌకర్యంగా రాకపోకలు సాగించే అవకాశం ఏర్పడిందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి గ్రామ సర్పంచ్ కొలి వెంకటేశ్వర్ తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని ప్రజలు పేర్కొన్నారు.

## బస్వాపూర్ ఉచిత వైద్య శిబిరం

**బంట్వారం, జనం సాక్షి :** బంట్వారం మండలం బస్వాపూర్ గ్రామంలో మహావీర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో, సర్పంచ్ స్రవంతి శివరాజ్ నేతృత్వంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. వైద్యులు గ్రామస్తులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశా రు. ఈ శిబిరాన్ని 120 మందికి పైగా ప్రజలు సద్వినియోగం చేసుకున్నారు. గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరమని సర్పంచ్ తెలిపారు.

## బంట్వారంలో వివాహిత అనుమానాస్పద మృతి

**బంట్వారం జులై 07 జనం సాక్షి :** బంట్వారం మండలం తోర్మామిడి గ్రామంలో వివాహిత సలీమా (26) అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. హైదరాబాద్ బోరబండకు చెందిన సలీమాకు 2022లో వాజీర్ సోహెల్తో వివాహం జరిగింది.తన కుమార్తె మృతిపై అనుమానం ఉందని తల్లి షేక్ ఫాతిమా ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్ఐ విమల తెలిపారు.

## ఘనంగా టీపీసీసీ మైనారిటీ రాష్ట్ర కన్వీనర్ రియాజ్ జన్మదిన వేడుకలు

- కేక్ కట్ చేసి, శాలువాతో సన్మానించిన కాంగ్రెస్ నాయకులు
- పెద్దేముల్ మండల అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు



**పెద్దేముల్ జులై 07(జనం సాక్షి):** టీపీసీసీ మైనారిటీ రాష్ట్ర కన్వీనర్ రియాజ్ జన్మదిన వేడుకలు వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండల కేంద్రంలో ఘనంగా జరిగాయి. పెద్దేముల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి రియాజ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

వేడుకల్లో భాగంగా నాయకుల మధ్య రియాజ్ చేత కేక్ కట్ చేయించారు. అనంతరం మండల అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి మరియు సీనియర్ నాయకులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించి, పుష్పగుచ్ఛాలు అందజేశారు. రియాజ్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని, పార్టీ బలోపేతానికి ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జితేందర్ రెడ్డి, ఎల్లా రెడ్డి, మంబాపూర్ శ్రీనివాస్ రెడ్డి, మైనారిటీ మండల అధ్యక్షుడు సాబిర్, డివై నర్సింలు, తట్టేపల్లి నర్సింలు, మైపుజ్, సుమిత్ర రాథోడ్, విద్యాసాగర్, నాగులపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే యువజన నాయకుడు హర్షవర్ధన్ రెడ్డి, ఆనందం చారి, షబ్బీర్, ఇక్బాల్, గోపాల్, చందు తదితర ముఖ్య నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మియాపూర్, మాదాపూర్‌లో 4.49 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- సీసీ రోడ్లు, వరద కాలువల నిర్మాణం
- గోకుల్ ఫ్లాట్స్, అయ్యప్ప సొసైటీలో ప్రధాన పనులు
- రేవంత్ మార్గదర్శకత్వంలో నియోజకవర్గ అభివృద్ధి
- నాణ్యతతో పనులు పూర్తి చేయాలి



**శేరిలింగంపల్లి :** శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్, మాదాపూర్ డివిజన్ల పరిధిలోని వివిధ కాలనీల అభివృద్ధికి 4 కోట్ల 49 లక్షల రూపాయలతో చేపట్టనున్న పనులకు రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ మంగళవారం శంకుస్థాపన చేశారు. మాదాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్ ఫ్లాట్స్, అయ్యప్ప సొసైటీ కాలనీల్లో 3 కోట్ల 67 లక్షల రూపాయల అంచనా వ్యయంతో సీసీ రోడ్లు, వరద నీటి కాలువల నిర్మాణం పనులకు మాజీ కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్‌తో కలిసి అరికెపూడి గాంధీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల సంక్షేమం, కాలనీల అభివృద్ధి తన ధ్యేయమని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని అరికెపూడి గాంధీ అన్నారు. నియోజకవర్గాన్ని అగ్రభాగాన నిలిపేందుకు నిజాయితీగా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తూ, ట్రాఫిక్ రహిత, సుఖవంతమైన రవాణా సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు.

శంకుస్థాపన చేసిన పనుల వివరాలు: మాదాపూర్ డివిజన్‌లో గోకుల్ ఫ్లాట్స్ చౌరస్తా నుంచి పిఎంఆర్ ఫార్చ్యూన్ వరకు 120 లక్షలతో సీసీ రోడ్లు, రోడ్డు డివైడర్లు; బాపు నగర్ కాలనీలో 40 లక్షలతో వరద నీటి కాలువ; అయ్యప్ప సొసైటీలో 48 లక్షలతో సీసీ రోడ్లు; పర్వత్ నగర్ జంక్షన్ నుంచి సున్నం చెరువు వరకు ఫుట్‌పాత్ నిర్మాణం తదితర పనులు ఉన్నాయి. పనుల్లో జాప్యం లేకుండా నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేయాలని అధికారులను అరికెపూడి గాంధీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు, అసోసియేషన్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

# ఘనంగా ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

### ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పుట్టినరోజు సందర్భంగా కేక్ కటింగ్



**ఫరూఖ్ నగర్ జనంసాక్షి :** ఆవిర్భావ దినోత్సవం ఘనంగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) ఆవిర్భావ దినోత్సవం, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని షాద్ నగర్ నియోజకవర్గంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నరసింహ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమనికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి రాగళ్ల ఉపేందర్ మాదిగ జెండాను ఆవిష్కరించి కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అయన మాట్లాడుతూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం మూడు దశాబ్దాలుగా నిరంతర పోరాటం సాగిస్తున్న ఉద్యమ సంస్థ అని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ చేసిన ఉద్యమం దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిందని, సామాజిక న్యాయం సాధనలో కీలక పాత్ర పోషించిందన్నారు. పీడిత, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎన్నో ప్రజా సమస్యలపై ఉద్యమించి ప్రభుత్వాల దృష్టిని ఆకర్షించిందని తెలిపారు. మందకృష్ణ మాదిగ తన జీవితాన్ని సామాజిక న్యాయం కోసం అంకితం చేసిన నాయకుడని కొనియాడారు. ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఎన్నో అవరోధాలను ఎదుర్కొంటూ రాజీలేని పోరాటం సాగించి లక్షలాది మంది పీడిత ప్రజలకు ఆశాకిరణంగా నిలిచారని పేర్కొన్నారు. ఆయన నాయకత్వం యువతకు స్ఫూర్తిదాయకమని, సమాన అవకాశాలు, సామాజిక సమానత్వం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. అనంతరం నాయకులు మందకృష్ణ మాదిగకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన ఆశయ సాధనకు కట్టుబడి పనిచేయాలని సంకల్పం వ్యక్తం చేశారు. సమాజంలో అసమానతలు తొలగి, ప్రతి వర్గానికి న్యాయం జరిగే వరకు ఎమ్మార్పీఎస్ ఉద్యమం కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఫరక్ నగర్ మండల అధ్యక్షులు జోగు నాగభూషణం, నియోజకవర్గ నాయకులు బొబ్బిలిగామ పాండు, నాగర్కుంట మహేందర్, ఎర్ర సురేష్‌లు పాల్గొన్నారు.



## దాత వెంకటేష్ ముదిరాజ్ ఔదార్యం పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ

**బొంరాస్ పేట,జూలై 7 (జనం సాక్షి):** మండల పరిధిలోని వడిచర్ల ప్రాథమికొన్నత పాఠశాలకు దాత వెంకటేష్ ముదిరాజ్ విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేసి ఔదార్యం చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాల ఉపాధ్యాయులు నరేందర్ దాత వెంకటేష్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు నర్సింలు,జనార్ధన్,కిష్టప్ప,రాజు, పూజారి నర్సింలు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్పర్సన్ సువర్ణ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## యువత నడుము బిగిస్తేనే అభివృద్ధి సాధ్యం: మేకల సారంగపాణి



**సికింద్రాబాద్(జనం సాక్షి):** యువత తలుచుకుంటే సాధించలేనిది ఏమీ లేదని, వారు నడుము బిగిస్తేనే సమాజంలో మార్పు, అభివృద్ధి సాధ్యమవుతుందని మహంకాళి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి, కంటెస్టెడ్ ఎమ్మెల్యే మేకల సారంగపాణి అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గ పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన మంద జగన్, అంబానగర్ బస్తీ అధ్యక్షుడిగా ఎన్నికైన కిషోర్ గౌడ్‌లను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం సారంగపాణి మాట్లాడుతూ.. బస్తీవాసులు, కుల సంఘాలు యువతను గుర్తించి వారికి తగిన అవకాశాలు కల్పించడం అభినందనీయమన్నారు. లభించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ సమాజ హితం కోసం పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని ఆయన ఆకాంక్షించారు. యువతకు భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ పూర్తి మద్దతుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాజకీయాలకతీతంగా బస్తీల అభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కేంద్ర మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి సహకారంతో కేంద్ర ప్రభుత్వ నిధులను రాబట్టి, బస్తీల అభివృద్ధికి, కుల సంఘాల ఐక్యతకు పూర్తి తోడ్పాటు అందిస్తామని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. నూతనంగా ఎన్నికైన నాయకులకు తాము అన్ని విధాలా తోడుగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో నరేందర్ నేత, మల్లేష్, మార్కండేయ, ఈశ్వర్, మంద మురళి, పాపయ్య, యాదగిరి, మరియు బీజేపీ నాయకులు హనుమంతు ముదిరాజ్, శ్రీ సాయి దత్తు, అరవింద్, వనమాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియను వేగవంతం చేయాలి : తహసిల్దార్ పద్మావతి

- **మందకోడిగా ఆన్లైన్ ప్రక్రియ కొనసాగడంపై తీవ్ర అసహనం**



**బొంరాస్ పేట, జూలై 7(జనంసాక్షి ):** ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాను పక్కగా సవరించడానికి,నవీకరించడానికి చేపట్టిన సర్' 'ప్రక్రియను పకడ్బందీగా చేపట్టి,వేగవంతం చేయాలని మండల తహశీల్దార్ పద్మావతి బొంరాస్ పేట బీఎల్వోలను ఆదేశించారు. మంగళ వారం మండల కేంద్రములోని మొదటి అంగన్వాడీ కేంద్రంలో సర్ ప్రక్రియపై మండల తహశీల్దార్,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేష్ రెడ్డి,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింలు గౌడ్ లతో కలసి గ్రామ బీఎల్ఓలతో సమీక్షించారు. మండల కేంద్రంలో జరుగుతున్న సర్ ప్రక్రియపై బీఎల్వోలను వివరంగా అడిగి తెలుసు కున్నారు. ప్రక్రియ ప్రారంభమై 12 రోజులు గడుస్తున్న ఇప్పటి వరకు 10% శాతం కూడా సర్ ప్రక్రియ పూర్తి కాక పోవడం పై మండల తహశీల్దార్ బీఎల్ఓ లపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సర్ ప్రక్రియ కొనసాగడం లో సిగ్నల్ వల్ల ఏర్పడుతున్న సమస్యలను బీఎల్ఓ లు మండల తహశీల్దార్ దృష్టి కి తీసుకొని రాగా, సర్ ప్రక్రియ పూర్తికై సాకులు చెప్పవద్దని సూక్ష్మంగా మందలించారు. తమకు సర్ ఫారం ఎలా పూర్తి చేయాలో తెలియక 50 రూపాయలు చెల్లించి సర్ ఫారాలు వ్రాయిస్తున్న మని దుద్యాల వెంకటమ్మ అనే ఓటరు మండల తహశీల్దార్ దృష్టికి తీసుకుని వచ్చారు. దీనిపై స్పందించిన మండల తహశీల్దార్ ఓటర్ల కు ఎలాంటి ఇబ్బంది కలుగ కుండా బీఎల్ఓలే విధిగా సర్ ఫారాలను నింపాలని ఆదేశించారు. గ్రామంలోని ఆయా పార్టీల బీఎల్ఏలు పంచాయతీ కార్యదర్శి సహకారం తో సర్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టి,వేగవంతం చేసి గడువు లోపల పూర్తీ చేయాలని బీ ఎల్ ఓ లను ఆదేశించారు. ఈ సమీక్ష లో పంచాయతీ కార్యదర్శి సుమిత్ర గ్రామ బీఎల్ఓ లు కల్పన, వెంకటమ్మ, షాహిన్ బేగం మరియు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## జానపద కళాకారులకు ప్రాతినిధ్యం లేని '99 రోజుల ప్రజా కళలు' కార్యక్రమం

### తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం (టీపీఎస్‌కే), సకల కళల జేఏసీ కార్యక్రమంపై పూర్తి వివరాలు వెల్లడించాలంటూ ఆర్టీఐ కింద వినతి



**ముషీరాబాద్, జూలై 7 (జనం సాక్షి):** భాషా, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 99 రోజుల "ప్రజా కళలు" కార్యక్రమంలో జానపద, గిరిజన, సంప్రదాయ కళాకారులకు తగిన ప్రాతినిధ్యం కల్పించలేదని తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం (టీపీఎస్‌కే), సకల కళల జేఏసీ ఆరోపించాయి. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని నిర్వహించిన విలేకరుల సమావేశంలో టీపీఎస్‌కే రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ప్రజా కళల అభివృద్ధి పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది జానపద కళాకారులు విస్మరణకు గురయ్యారని అన్నారు. కార్యక్రమానికి సంబంధించిన బడ్జెట్, ఖర్చులు, కళాకారుల ఎంపిక, పారితోషికాలు, కార్యాచరణ తదితర వివరాలను సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) ద్వారా కోరుతున్నట్లు తెలిపారు. సకల కళల జేఏసీ ప్రధాన కార్యదర్శి సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ 99 రోజుల కార్యక్రమానికి ప్రభుత్వం కేటాయించిన నిధులు, ఇప్పటివరకు చేసిన ఖర్చులు, ఎంపికైన కళాకారుల వివరాలు, ఎంపిక ప్రమాణాలు, జానపద కళాకారులకు కల్పించిన అవకాశాలపై పూర్తి వివరాలను ప్రభుత్వం ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. జేఏసీ ఉపాధ్యక్షుడు గురూజీ సాధు మహారాజ్, జానపద సకల కళల వృత్తి కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు తాళ్లపల్లి సంధ్య మాట్లాడుతూ జానపద కళాకారులను పక్కనపెట్టి నిర్వహిస్తున్న కార్యక్రమం ప్రజా కళల ఆత్మను దెబ్బతీస్తోందని విమర్శించారు. గతంలో సాంస్కృతిక సంస్థల అభిప్రాయాలతో కార్యక్రమాలు రూపొందించేవారని, ప్రస్తుతం ఆ సంప్రదాయాన్ని విస్మరించా రని అన్నారు. ప్రభుత్వం వెంటనే పూర్తి పారదర్శకతతో వివరాలు వెల్లడించి జానపద కళాకారులకు సముచిత ప్రాతినిధ్యం కల్పించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ప్రజాస్వామ్యబద్ధమైన ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పొన్నం రాజయ్య, కొల జనార్ధన్, వి. కురుమూర్తి, ఖాజా మొహీనుద్దీన్, దాట్ల నిర్మల, తాండ్ర స్వర్ణలత పాల్గొన్నారు.

## నవాబుపేట్ మండల సర్పంచుల సంఘం అధ్యక్షులుగా కావలి కొండయ్య యాదవ్

- **సమన్వయం, గ్రామ సమస్యల పరిష్కారమే లక్ష్యం**
- **మండలాభివృద్ధికి కలిసికట్టుగా పని చేస్తాం**
- **కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం**



**నవాబుపేట్, జూలై 7:** నవాబుపేట్ మండలంలోని నూతన సర్పంచుల ఆత్మీయ సమావేశం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సామ వెంకటరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మేడిపల్లి వెంకటయ్య ఆధ్వర్యం లో ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో మండల సర్పంచుల సంఘం అధ్యక్షులుగా ఎల్లకొండ సర్పంచ్ కావలి కొండయ్య యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. నూతన సర్పంచులందరూ కలిసికట్టుగా కొండయ్య యాదవ్ నాయకత్వాన్ని బలపరిచారు. మండలంలోని సర్పంచుల మధ్య సమన్వయం పెంపొందించడం, గ్రామాల్లోని సమస్యల పరిష్కారం కోసం కలిసి పనిచేయడం ఈ సమావేశం ముఖ్య ఉద్దేశమని నాయకులు తెలిపారు. తనను అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు తోటి సర్పంచులు, ప్రజాప్రతినిధులకు కొండయ్య యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. అందరినీ కలుపుకొని మండల అభివృద్ధికి శ్రమిస్తానని హామీ ఇచ్చారు. కార్యవర్గం వివరాలు:అధ్యక్షులు: కావలి కొండయ్య యాదవ్ (ఎల్లకొండ) ఉపాధ్యక్షులు: గాజులగూడెం నరసింహారెడ్డి (నవాబు), పులుమామిడి దాన నరసింహులుప్రధాన కార్యదర్శి: గంగ్యాండ దోసాడ మల్లేశంకార్యదర్శులు: చించల్పేట్ గుడిసె అనుసుజ అనంతరాములు, శ్రీనివాస్ రెడ్డి, నారే గూడెం ఎలువర్తి దీపక్ దశరథ్, మీనాపల్లి కలాన్ వెంకటమ్మయేసయ్యకార్యవర్గ సభ్యులు: గేట్ వనంపల్లి బండారు అనిత, ఆంజనేయులు దుర్గయ్య, పూలపల్లి ఎలివేలు భాగ్యలక్ష్మి, ఏ. ప్రభాకర్, మాదారం లావణ్య ప్రభు, యావపూర్ శివనీల లక్ష్మణ్, జి. శ్రీనివాస్ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కొండయ్య యాదవ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మేడిపల్లి వెంకటయ్య, బీబ్లాక్ ప్రెసిడెంట్ పోలీస్ మధుసూదన్ రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షులు శ్రీధర్, ఉపాధ్యక్షులు సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మందకృష్ణ ఆశయాలకు అభివందనం

పెద్దేముల్, (జనంసాక్షి): సామాజిక న్యాయం, సమానత్వం కోసం 32 ఏళ్లుగా పోరాడుతున్న ఎమ్మార్పీఎస్ ఉద్యమ పతాక ఆవిష్కరణ వార్షికోత్సవం, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మన్యం శ్రీ మందకృష్ణ మాదిగ, జన్మదిన సందర్భంగా పెద్దేముల్ మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి స్వామిదాసు, మండల అధ్యక్షులు ఉమాశంకర్, కె.వి.పి.ఎస్ కోళ్ళ గోపాల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ..32 ఏళ్ల ఉద్యమ పతాకం 1994 జులై 7న ఆవిష్కరించబడిన ఎమ్మార్పీఎస్ జెండా నేడు 32 వసంతాలు పూర్తి చేసుకుంది. మాదిగలతో పాటు ఎస్సీ ఉపకులాలందరికీ సమాన వాటా, సామాజిక న్యాయం కోసం సాగుతున్న ఈ ఉద్యమానికి జెండా స్ఫూర్తిగా నిలిచిందని తెలిపారు. మందకృష్ణ మాదిగ ,32 ఏళ్లుగా సామాజిక న్యాయం కోసం చేస్తున్న పోరాటం మాకు స్ఫూర్తి. ఆయన చూపిన బాటలో నడుస్తూ వర్గీకరణ సాధన దిశగా మా ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తాం అనిఅన్నారు. అనంతరం మందకృష్ణ మాదిగ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి జై భీమ్ - జై మందకృష్ణ నినాదాలతో హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు పిల్లి రాజు, జై భీమ్ యూత్ మాజీ అధ్యక్షులు కోడి బాలరాజు,ఎర్ర కృష్ణ.రమేష్,మాలె పురుషోత్తం,బైండ్ల రమేష్, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు.